విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 212 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 23 డిసెంబర్ 2025 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## సోనియా, రాహుల్ గాంధీ లకు దిల్లీ హైకోర్టు నోటీసులు



న్యూ దిల్లీ, డిసెంబర్ 22: నేషనల్ హెరాల్డ్? కేసులో ట్రయల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్ పై స్పందించాలని కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కి దిల్లీ హైకోర్టు ఆదేశించింది. డిసెంబర్ 16 న ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వు పై స్టే కోరుతూ ఈడి దాఖలు చేసిన పిటిషన్ పై జస్టిస్ రవీంద్ర దూదేజా నోటీసులు

వివరాలు 2లో..

# విజయవాడలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు...



- ఏ ప్లస్ కన్వెన్షన్ లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు
- హాజరైన సీఎం చంద్రబాబు
- క్రిస్మస్ కేక్ కట్ చేసి మత పెద్దలకు తినిపించిన సీఎం





క్రీస్తు త్యాగాలను స్మరిస్తూ ఆయన చూపిన బాటను అనుసరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. క్రైస్తవులకు సంక్షేమం, ఆర్థిక చేయూత అందించింది తమ ప్రభుత్వమేనని అన్నారు. విజయవాడ ఏ ప్లస్ కన్వెన్షన్ లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ సాయంత్రం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. క్రిస్మస్ కేట్ కట్ చేసి మత పెద్దలకు తినిపించారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఏసు ప్రభువు ఈ లోకంలో జన్మించిన రోజును మనం క్రిస్మస్ గా జరుపుకుంటాం. ప్రపంచంలో జరిగే అతిపెద్ద పండుగ క్రిస్మస్. మేరీ మాత కడుపున ఏసు ప్రభువు జన్మించిన పవిత్రమైన రోజు మన అందరికీ పండుగైంది. ప్రపంచానికి ప్రేమ, శాంతి, సేవ అనే శాశ్వత విలువలను అందించిన ఏసు సందేశం ఎప్పటికీ మార్గదర్శకం. క్రీస్తు బోధనల్ని ఆయన చూపిన బాటను అంతా అనుసరించాలి. పశువుల పాకలో పుట్టి... గొర్రెల కాపరిగా పెరిగిన ప్రజా రక్షకుడు ఏసు. నమ్మిన సిద్ధాంతం కోసం బలి దానానికి సైతం వెనుకాడని క్రీస్తు గొప్పదనం నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలి. ప్రభువు త్యాగ్యాన్ని స్మరించుకోవాలి. శాంతి మార్గాన్ని అనుసరించాలి. ప్రేమ తత్వాన్ని పెంచాలి.

వివరాలు 2లో..

## జనసేన నాయకులకు గుడ్ న్యూస్ చెప్పిన పవన్ కల్యాణ్



మంగళగిరి, డిసెంబరు 22: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జనసేన నేతలతో మంగళగిరి లోని పార్టీ క్యాంపు కార్యాలయంలో సోమవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాల పై చర్చించారు. ఈ సమావేశానికి జనసేన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక సంస్థల ప్రతినిధులు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలను ఉద్దేశించి మాట్లాడారు పవన్ కల్యాణ్. త్వరలోనే మరికొన్ని కమిటీల్లో కూడా పదవులు కేటాయించబోతున్నామని స్పష్టం చేశారు.

వివరాలు 2లో..

## సామాన్యు లను దోచు కోవడానికి మోదీ ప్రభుత్వం ఏ అవకాశాన్నీ వదలడం లేదు ఖర్గే




న్యూ దిల్లీ : కేంద్రం లోని మోదీ సర్కార్ ఈ ఏడాది లోనే మరోసారి రైల్వే ఛార్జీలను పెంచి ప్రజల పై మరో భారాన్ని మోపింది. దీంతో సామాన్య ప్రజలను దోచుకోవడానికి మోదీ ప్రభుత్వం ఏ అవకాశాన్నీ వదలడం లేదని సోమవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో మండి పడ్డారు.

వివరాలు 7లో..

## అమరావతిలో కొత్త ప్రాజెక్టులకు ఏపీ ప్రభుత్వం నిర్ణయం..!



**అమరావతి, డిసెంబరు 22:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో సోమవారం సచివాలయంలో 56 వ సీఆర్డీఏ అథారిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం చంద్రబాబు పలు కీలక అంశాల పై

వివరాలు 2లో..

## వరుస రాజీనామాలతో వైసీపీలో కలకలం



పల్నాడు జిల్లా, డిసెంబర్ 22: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి వరుస షాక్ లు తగులుతూనే వున్నాయి. ఎన్నో రోజులుగా అంతర్గతంగా కొనసాగుతున్న వర్గ విభేదాలు ఇప్పుడు బహిరంగంగా బయటపడటంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. సత్తెనపల్లి నియోజకవర్గంలో పార్టీ కీలక నాయకులు, ప్రజా ప్రతినిధులు, వివిధ పదవుల్లో ఉన్న నేతలు ఒకరి తర్వాత ఒకరు రాజీనామాలు చేయడంతో వైసీపీలో తీవ్ర కలకలం నెలకొంది. ఈ పరిణామాలకు కేంద్ర బిందువుగా సత్తెనపల్లి ఇన్‌చార్జి గజ్జల

వివరాలు 2లో..

## కల్తీ నెయ్యి కేసులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ని విచారించిన సిబిఐ బృందం

అమరావతి, డిసెంబరు 22: టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ని సీబీఐ ఆధ్వర్యం లోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సోమవారం విచారించింది. విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్న చెవిరెడ్డి ని ఉదయం 11 గంటల నుంచి




వివరాలు 2లో..

## పీవీ సునీల్ కుమార్ పై డీజీపీకి ఫిర్యాదు చేసిన రఘురామ



- డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై ఐపీఎస్ సునీల్ కుమార్ తీవ్ర ఆరోపణలు
- అన్ని పదవుల నుంచి రఘురామను వెంటనే తొలగించాలని డిమాండ్
- ఆయన అరెస్టయితే అమరావతి బ్రాండ్ దెబ్బతింటుందని వ్యాఖ్య
- సునీల్ కుమార్‌పై డీజీపీకి ఫిర్యాదు చేసిన రఘురామ
- సర్వీస్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని ప్రత్యారోపణలు

వివరాలు 2లో..

## పవన్ కళ్యాణ్ పై అభ్యంతరకర పోస్ట్ లపై చర్యలు తీసుకోవాలి

### దిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు..!

**మంగళగిరి, డిసెంబర్ 22:** రాష్ట్ర డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు ఇవాళ భారీ ఊరట లభించింది. తాను సినిమాల్లో ఉన్నా, రాజకీయాల్లో ఉన్నా తన వ్యక్తిగత హక్కుల గోప్యత విషయంలో జరుగుతున్న ఉల్లంఘనల పై ఆయన దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు.

వివరాలు 2లో..




## ఐపీఎస్ అధికారి కి ప్రివిలేజ్ నోటీసులు



అమరావతి, డిసెంబర్ 22: ఐపీఎస్ అధికారి అమ్మిరెడ్డి కి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సోమవారం ప్రివిలేజ్ నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ను కించపరిచేలా సోషల్ మీడియాలో ట్వీట్ చేశారనే ఆరోపణల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు మండలి వర్గాలు వెల్లడించాయి. వివరణ ఆధారంగా తదుపరి చర్యలు: గతంలో గుంటూరు అర్బన్ ఎస్పీ గా పనిచేసిన సమయంలో అమ్మిరెడ్డి చేసిన ట్వీట్ వివాదాస్పదంగా మారింది.

వివరాలు 2లో..

## బెల్టు షాపుల బెండ్ తీసేందుకు చంద్రబాబు కొత్త ప్లాన్..




అమరావతి, డిసెంబర్ 22: రాష్టంలో బెల్ట్ షాపుల కట్టడికి ఏపీ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో బెల్టు షాపుల నియంత్రణకు హరియాణా మోడల్ అనుసరించాలని అధికారులకు సూచించారు. సోమవారం సీఎం చంద్రబాబు ఎక్సైజ్ శాఖ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్టు షాపుల నియంత్రణకు హరియాణా తరహాలో సబ్ లీజ్ విధానాన్ని అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. వ్యాపారంలా చూడకుండా, ఆరోగ్యకర మైన వృద్ధి సాధించేలా చూడాలని ముఖ్యమంత్రి నారా నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ఆదాయమే లక్ష్యంగా విధానాలు ఉండకూడదని సూచించారు.

వివరాలు 2లో..

# జనసేన నాయకులకు గుడ్ న్యూస్ చెప్పిన పవన్ కల్యాణ్

మొదటి పేజీ తరువాయి
పదవులు చిన్నవా, పెద్దవా అని కాదని, వాటి బాధ్యతలను అందరూ గుర్తించాలని దిశానిర్దేశం చేశారు. మంగళగిరి లోని జనసేన కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాల పై చర్చించారు, అనంతరం పవన్ మాట్లాడుతూ జనసేన నుంచి 3,400 మంది నామినేటేడ్ పదవులు పొందారన్నారు. ప్రస్తుతం మన పార్టీ నుంచి 21 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు ఉన్నారు. మన సిద్ధాంతాలు, విధానాలు నచ్చి మరికొంత మంది ఎమ్మెల్యేలు జనసేనలో చేరనున్నారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల తర్వాత జనసేనకు ఒక ఉప ముఖ్యమంత్రి, ఇద్దరు మంత్రులు ఉన్నారు. నాగబాబు చేసిన త్యాగాలను గుర్తించి నాగబాబుకు, పార్టీ కోసం నిలిచిన హరిప్రసాద్‌కు ఎమ్మెల్సీలు ఇచ్చాం. పలు కార్పొరేషన్‌లకు చైర్మన్లు, డైరెక్టర్లుగా పదవులు ఇచ్చాం. బాలినేని శ్రీనివాస రెడ్డి, ఉదయ భాను వంటి నేతలు వైసీపీ నుంచి జనసేన లోకి వచ్చారు. బాలినేని లాంటి నేతలు ఇప్పుడు రెండు వైపులా మాటలు పడే పరిస్థితి. కెరియర్ ఓరియంటెండ్ పొలిటికల్ లీడర్ ఎలా ఉంటారో చెప్పేందుకు బాలినేని నిదర్శనం. జగన్ ప్రభుత్వం దాష్టికాలకు వ్యతిరేకంగా బయటకు వచ్చిన సమయంలో సాయిప్రసాద్‌ను మహిళా సీఐ కొట్టినా వెనకడుగు వేయలేదు. అటువంటి సాయి ప్రసాద్ ను శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్‌గా ఇచ్చాం అని పవన్ కల్యాణ్ తెలిపారు.

జగన్ ప్రభుత్వంలో ఇబ్బందులు...

గంటా స్వరూప, ప్రియా సౌజన్య కార్పొరేషన్‌లకు డైరెక్టర్లుగా నియమించాం. పంచకర్ల సందీప్ కు కార్పొరేషన్ చైర్మన్‌గా చేస్తున్నాం. మన నేత రూప పై నాన్ బెయిల్ కేసులు పెట్టి జగన్ ప్రభుత్వంలో ఇబ్బందులు పెట్టారు.. ఆమెను కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నుకున్నాం. ఇలా పార్టీ కోసం, ప్రజల కోసం పని చేసిన వారిని గుర్తించి అనేక పదవులు ఇచ్చి బాధ్యతలు అప్పగించాం. ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్‌గా ఇచ్చిన విషయం ఆయనకు చివరి వరకూ తెలియదు. అంటే ఎవరి సిఫార్సులు లేకుండా కేవలం పని ఆధారంగానే పదవులు కేటాయించాం అన్నారు. ఓటమి పాలైనా పార్టీ కోసం పని చేసిన మహిళలను కార్పొరేషన్ చైర్మన్‌లుగా నిర్వహించాం. చిల్లపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా

ఈ రోజు ఏర్పాట్లు చేసినందుకు ధన్యవాదాలు. ఏపీఎంయస్ఐడీ చైర్మన్‌గా చిల్లపల్లి శ్రీనివాస్ ఉన్నారు. పోలీసు హౌంసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా అనేక పేర్లు వచ్చినప్పటికీ కేకే సరైన వారు అని నియమించాం. చాలా సంవత్సరాలుగా ఆయన పోలీసులతో పోరాడారు. హస్తకళల చైర్మన్‌గా హరిప్రసాద్, జానపదకళలు ఛైర్మన్‌గా మనమే నియమించాం. మాల వేల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్‌గా విజయ కుమార్‌ను నియమించాం. ఇలా చాలా కార్పొరేషన్‌లకు చైర్మన్ లుగా, డైరెక్టర్లుగా ఎంపిక చేయడం వెనుక మా ఉద్దేశం ప్రజలకు బాధ్యతతో సేవ చేస్తారనే నియమిస్తున్నాం. షేక్ రియాజ్ మొదటి నుంచి పార్టీ కోసం అనేక దెబ్బలు తిన్నారు అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# సోనియా, రాహుల్ గాంధీ లకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

మొదటి పేజీ తరువాయి
జారీ చేశారు. కాగా, ఈ పిటిషన్ తదుపరి విచారణను 2026 మార్చి 12 నాటికి వాయిదా వేసింది ఢిల్లీ హైకోర్టు. ఈడి తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించగా, గాంధీ తరపున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ సింఘ్వీ, ఆర్ ఎస్ చీమా హాజరయ్యారు. చట్ట ప్రకారం పరిగణన లోకి తీసుకోవడం కుదరదని ట్రయల్ కోర్టు తీర్పు.

అంతకు ముందు నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పై ఈడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను పరిగణన లోకి తీసుకునేందుకు ఢిల్లీ లోని రౌస్ అవెన్యూ కోర్టు నిరాకరించింది. మనీలాండరింగ్ యాక్ట్ కింద ఈడీ దాఖలు చేసిన ఫిర్యాదును కొనసాగించలేమని కోర్టు అభిప్రాయపడింది. ప్రైవేటు వ్యక్తి చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈడీ ఈ కేసులో దర్యాప్తు జరిపి ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసినట్లు ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే అన్నారు. చట్ట ప్రకారం దీనిని పరిగణన లోకి తీసుకోవడం కుదరదని స్పష్టం చేశారు. ఈ కేసులో ఇప్పటికే ఢిల్లీ ఆర్థిక నేరాల విభాగం ఎఫ్?ఐఆర్ నమోదు చేసిన విషయాన్ని గుర్తుచేసిన ఆయన, అలాంటప్పుడు

ఈడీ ఛార్జ్‌షీట్ ఆధారంగా తీర్పు ఇవ్వడం తొందరపాటు చర్యే అవుతుందన్నారు. 1938 లో జవహర్‌లాల్ నెహ్రూ స్థాపించిన చారిత్రక వార్తాపత్రిక నేషనల్ హెరాల్డ్?లో అవకతవకలు జరిగాయంటూ 2012 లో బీజేపీ నేత సుబ్రమణియన్ స్వామి పిటిషన్?ను దాఖలు చేశారు. ఆ తర్వాత ఈ నేషనల్ హెరాల్డ్ పత్రిక, అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్) సంస్థలో మనీ లాండరింగ్ జరిగినట్లు ఈడీ తేల్చింది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కి సంబంధించిన యంగ్ ఇండియన్ ప్రైవేట్ కంపెనీ ఏజెఎల్? సంస్థకు చెందిన రూ.2000 విలువైన స్థలాలను కేవలం రూ.50 లక్షలకే దక్కించుకున్నట్లు అభియోగాలు మోపింది. వైఐఎల్?లో రాహుల్ ?కు 38 శాతం, సోనియాకు 38 శాతం షేర్లు ఉన్నాయి. ఏజేఎల్‌కు చెందిన 99 శాతం షేర్లను యంగ్ ఇండియన్ లిమిటెడ్‌కు బదిలీ చేశారు. ఈ లావాదేవీ మనీలాండరింగ్‌లో భాగమని ఈడీ ప్రధానంగా ఆరోపిస్తోంది. 2021 నుంచి సాగుతున్న ఈడీ దర్యాప్తు:

దీని పై మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన ఈడీ 2021 నుంచి అధికారికంగా దర్యాప్తును ప్రారంభించింది. 2025 ఏప్రిల్ 9 న మనీ లాండరింగ్ నిరోధక చట్టం లోని సెక్షన్లు 3, 4 కింద చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ కేసులో సోనియా గాంధీని ఏ 1 గా, రాహుల్ గాంధీని ఏ 2 గా ఈడీ చేర్చింది. వారితో పాటు మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్, సుమన్ దూబే, శ్యామ్ పిట్రోడాలతో పాటు యంగ్ ఇండియన్ అనే ఒక ప్రైవేటు కంపెనీ కుట్రకు, మనీ లాండరింగ్ కు పాల్పడినట్టు ఈడీ ఆరోపిస్తోంది. కాగా మోతీలాల్ వోరా 2020 లో, ఆస్కార్ ఫెర్నాండెజ్ 2021 లో మరణించారు.

# పవన్ కళ్యాణ్ పై అభ్యంతరకర పోస్ట్ లపై చర్యలు తీసుకోవాలి

మొదటి పేజీ తరువాయి
సోషల్ మీడియాలో తన వ్యక్తిగత హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఆరోపిస్తూ పిటిషన్ దాఖలు చేశారు. దీని పై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు ఇవాళ కీలక ఆదేశాలు ఇచ్చింది. పవన్ కళ్యాణ్ తన పిటిషన్ లో తన అనుమతి లేకుండా పేరు, చిత్రం, గొంతు, వ్యక్తిత్వానికి సంబంధించిన అంశాల్ని వాణిజ్య ప్రయోజనాల కోసం వాడు కోకుండా అడ్డు కోవాలని ఢిల్లీ హైకోర్టును కోరారు. ప్రస్తుతం కీలక రాజ్యాంగ పదవిలో ఉన్న తన వ్యక్తిత్వానికి భంగం వాటిల్లడం వల్ల తన ప్రజా జీవితం పై ప్రభావం పడుతుందని పవన్ కళ్యాణ్ ఆరోపించారు. దీనిపై జస్టిస్ మన్మీత్ ప్రీతం సింగ్ అరోరా నేతృత్వం లోని ధర్మాసనం విచారణ చేపట్టింది. పవన్ వ్యక్తిగత హక్కుల ఉల్లంఘన పై వివరాలు తీసుకుంది. అనంతరం దర్యాప్తు సంస్థలకు ఆదేశాలు ఇచ్చింది. 2021 ఐటీ నిబంధనల ప్రకారం పవన్ కళ్యాణ్ కు సంబంధించి సోషల్ మీడియాలో పెట్టిన అభ్యంతరకర ఫోటోలు, వీడియోల పై చర్యలు తీసుకోవాలని ఢిల్లీ హైకోర్టు దర్యాప్తు సంస్థల్ని ఆదేశించింది. ఈ మేరకు సంబంధిత సోషల్ మీడియా సంస్థలు, ఈ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లకు సైతం నోటీసులు జారీ చేసింది. పవన్ కళ్యాణ్ ప్రమేయం లేకుండా ఆయన ఇమేజ్‌ను వాడుతున్న లింకులను తొలగించాలని కూడా ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఈ విషయంలో పవన్ కు ఊరట దక్కినట్లయింది. గతంలో అమితాబ్ బచ్చన్ తో పాటు ఐశ్వర్యారాయ్, రజనీకాంత్, జూనియర్ ఎన్టీఆర్ కూడా ఇలాంటి ఆదేశాలే తెచ్చుకున్నారు.

# బెల్టు షాపుల బెండ్ తీసేందుకు చంద్రబాబు కొత్త ప్లాన్..

మొదటి పేజీ తరువాయి
మద్యాన్ని కూడా ఒక ఉత్పత్తిలానే పరిగణించాలని అధికారులకు చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీలో ప్రస్తుతం అమలవుతున్న లాటరీ ద్వారా షాపుల కేటాయింపు, అప్లికేషన్ ఫీజు, లిక్కర్ ఐడెంటిఫికేషన్ నెంబర్, రిటైలర్ మార్జిన్ పెంపు వంటి అంశాల పై మరింత కసరత్తు చేయాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. బార్ ఏఆర్ఈటీ (అడిషనల్ రిటెయిల్ ఎక్సైజ్ టాక్స్) మినహాయింపు ఇచ్చే విషయాన్ని కూడా పరిశీలించాలని నిర్దేశించారు. అక్రమ మద్యాన్ని అరికట్టడంతో పాటుగా, బెల్టు షాపుల నియంత్రణ, డిజిటలైజేషన్, పర్యావరణ పరి రక్షణకు సంబంధించి సంస్కరణలు తీసుకురావాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ పై చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్‌తో పాటుగా ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్షలో కొత్త ఎక్సైజ్ విధానాల అమలు, వాటి ప్రభావం పై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా బెల్టు షాపుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. బెల్టు షాపుల కట్టడికి హరియాణా మోడల్ అనుసరించాలని సూచించారు. హరియాణాలో సబ్ లీజ్ విధానం అమలవుతోంది. ఈ నేపథ్యంలో హరియాణా తరహాలో సబ్ లీజ్ విధానాన్ని అధ్యయనం చేయాలని చంద్రబాబు ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు. మరో వైపు చంద్రబాబుతో సమీక్ష సందర్భంగా అధికారులు పలు విషయాలను ముఖ్యమంత్రికి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మద్యం షాపులు లేకపోవటం తోనే బెల్టు షాపులు ఏర్పాటవుతున్నాయని వివరించారు. అలాగే పర్యావరణ పరి రక్షణలో భాగంగా లిక్కర్ బాటిల్ ను వాడేసిన అనంతరం తిరిగి ఇచ్చిన వారికి డిపాజిట్ రిటర్న్ స్కీమ్ కింద నగదు ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు చంద్రబాబు దృష్టికి తెచ్చారు. మరో వైపు ఏపీలో మద్యం విక్రయాలు పెరిగాయి. ఈ విషయాన్ని సీఎం తో సమీక్ష సందర్భంగా అధికారులు వెల్లడించారు. 2024 అక్టోబర్ నుంచి నూతన మద్యం విధానం అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి 2025 అక్టోబర్ వరకూ 8 వేలకోట్ల ఎక్సైజ్ ఆదాయం లక్ష్యంగా పెట్టుకుంటే రూ.7,041 కోట్లు వచ్చినట్లు అధికారులు చంద్రబాబుకు వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ 17 వరకూ మద్యం విక్రయాలు 4.52 శాతం వరకూ పెరిగాయని వివరించారు. ఈ సందర్భంగా నకిలీ మద్యానికి ఆస్కారం లేకుండా ప్రతి లిక్కర్ బాటిల్ మీద కూడా ప్రత్యేక లిక్కర్ ఐడెంటిఫికేషన్ నంబర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు చంద్రబాబు సూచించారు.

# వరుస రాజీనామాలతో వైసీపీలో కలకలం

మొదటి పేజీ తరువాయి
సుధీర్ భార్గవ్ రెడ్డి వ్యవహారం మారినట్లు సమాచారం. మాజీ మంత్రి, వైసీపీ అగ్రనేత అంబటి రాంబాబు వర్గాన్ని పూర్తిగా పక్కన పెట్టి, పార్టీని ఏకపక్షంగా నడుపుతున్నారని ఆరోపిస్తూ పలువురు నేతలు బహిరంగంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ అసంతృప్తి చివరికి రాజీనామాల రూపంలో ఒక్కసారిగా బయటపడింది. సత్తెనపల్లి రాజకీయాల్లో అంబటి రాంబాబు వర్గానికి గణనీయమైన పట్టుందని ఆయన వర్గం చెబుతోంది. గతంలో వైసీపీని బలోపేతం చేసిన తమ వర్గాన్ని ప్రస్తుతం పూర్తిగా పక్కన పెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ నిర్ణయాల్లో తమను సంప్రదించడం లేదని, స్థానిక కార్యకర్తలకు న్యాయం జరగడం లేదని, కేవలం ఒక వర్గానికే ప్రాధాన్యం ఇస్తున్నారని అసంతృప్త నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి నాయకత్వం ఏకపక్షంగా మారిందని, పార్టీ శ్రేణుల్లో సమన్వయం లేకుండా పోయిందని విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మండల, గ్రామస్థాయి నాయకులను పూర్తిగా విస్మరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ అంతర్గత విభేదాలకు పరాకాష్టగా వరుస రాజీనామాలు చోటుచేసుకున్నాయి. వైసీపీ సత్తెనపల్లి మండల అధ్యక్షుడిగా ఉన్న రావిపాటి పురుషోత్తం తన పదవికి రాజీనామా చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే మండల అధ్యక్షుడే తప్పుకోవడం తీవ్రతను స్పష్టంగా చూపిస్తోంది. రాజీనామాలతో పెద్ద దెబ్బ.. అలాగే, సత్తెనపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు నాగేశ్వరమ్మ కూడా తన పదవికి రాజీనామా చేశారు. జిల్లా స్థాయి ప్రజాప్రతినిధి రాజీనామా చేయడం పార్టీకి పెద్ద దెబ్బగా మారింది. కేవలం స్థానిక నేతలే కాకుండా, రాష్ట్రస్థాయి పదవుల్లో ఉన్నవారు కూడా రాజీనామాలు చేయడం పార్టీకి మరింత ఇబ్బందికరంగా మారింది. వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చిలకా జయపాల్ తన పదవికి రాజీనామా చేయడం సంచలనంగా మారింది.రాజుపాలెం మండలానికి చెందిన ఎంపీపీ తెలుకుట్ల రాజేశ్వరి రాజీనామా చేయడం కూడా రాజకీయంగా కీలకంగా మారింది. మండల పరిషత్ అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవడంతో మండల స్థాయిలో పార్టీ బలం దెబ్బతినే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రాజుపాలెం మండలంలో గ్రామస్థాయి నాయకత్వం కూడా కుదేలవుతోంది. ఉప్పలపాడు ఎంపీటీసీ సభ్యుడు భద్రరెడ్డి రాజీనామా చేయగా, గణపవరం-1 ఎంపీటీసీ మంచు నందనం కూడా తన పదవికి రాజీనామా చేశారు. ఈ విషయం గ్రామస్థాయి ఫ్యాన్ పార్టీ కార్యకర్తల్లో తీవ్ర నిరాశను కలిగిస్తోంది.ఈ రాజీనామాలతో రాబోయే ఎన్నికల పై ప్రభావం.. గ్రామ స్థాయిలో పార్టీకి కీలకంగా పనిచేసే ఎంపీటీసీలు తప్పుకోవడంతో రాబోయే ఎన్నికల పై ప్రభావం పడే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. రాజీనామా చేసిన నేతలంతా ఒకే స్వరంతో మాట్లాడుతున్నారు. గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి నాయకత్వం ఇలాగే కొనసాగితే సత్తెనపల్లిలో వైసీపీకి తీవ్ర నష్టం తప్పదని హెచ్చరిస్తున్నారు. పార్టీని ఒకే వర్గానికి పరిమితం చేసి నడిపితే, ప్రజల్లో నమ్మకం కోల్పోతుందని స్థానిక నేతలు అంటున్నారు. వైసీపీ అధిష్ఠానం వెంటనే జోక్యం చేసుకుని, సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని, అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు వెళ్లాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే మరిన్ని రాజీనామాలు తప్పవనే సంకేతాలు ఇస్తున్నారు. సత్తెనపల్లి నుంచి వస్తున్న ఈ పరిణామాలు వైసీపీ రాష్ట్ర నాయకత్వం పై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి. ఒక నియోజకవర్గంలో ఇంత పెద్ద సంఖ్యలో నేతలు రాజీనామాలు చేయడం పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే అంశంగా మారింది. రాబోయే రోజుల్లో కీలక నేతలు కూడా పార్టీకి దూరమయ్యే అవకాశం ఉందన్న ప్రచారం ఊపందుకుంటోంది. ఈ నేపథ్యంలో వైసీపీ హైకమాండ్ ఎలా స్పందిస్తుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. మొత్తంగా చూస్తే, సత్తెనపల్లి వైసీపీలో చోటుచేసుకుంటున్న ఈ వర్గ విభేదాలు పార్టీకి కీలక మలుపుగా మారుతున్నాయి. ఒకవైపు నాయకత్వం పై అసంతృప్తి, మరో వైపు వరుస రాజీనామాలు ఇవన్నీ కలిపి పార్టీ భవిష్యత్తుపై ప్రశ్నార్థకంగా మారాయి. ఇప్పటి కైనా వైసీపీ హై కమాండ్ తక్షణ చర్యలు తీసుకుని పరిస్థితిని చక్కదిద్దితేనే నష్టం తగ్గే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. లేకపోతే సత్తెనపల్లి నియోజకవర్గంలో వైసీపీకి ఇది పెద్ద రాజకీయ ఎదురుదెబ్బగా మారే అవకాశం ఉందని పార్టీ సభ్యులు భావిస్తున్నారు.

## ఐపీఎస్ అధికారి కి ప్రివిలేజ్ నోటీసులు

మొదటి పేజీ తరువాయి
దీని పై వచ్చిన ఫిర్యాదును పరిశీలించిన శాసనమండలి, వ్యవహారాన్ని హక్కుల కమిటీ కి అప్పగించింది. ఈ క్రమంలో నేడు మంగళవారం మధ్యాహ్నం 2:30 గంటలకు జరిగే హక్కుల కమిటీ సమావేశానికి హాజరై తన వివరణ ఇవ్వాలని అమ్మిరెడ్డికి నోటీసుల్లో ఆదేశించారు. కమిటీ ముందు ఆయన ఇచ్చే వివరణ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## కల్తీ నెయ్యి కేసులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ని విచారించిన సిబిఐ బృందం

మొదటి పేజీ తరువాయి
మధ్యాహ్నం వరకు విచారించారు. కల్తీ నెయ్యి కుంభకోణం జరిగిన సమయంలో టీటీడీ బోర్డు సభ్యుడుగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వ్యవహరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనను విచారించేందుకు అనుమతి ఇవ్వాలని సీబీఐ అధికారులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు అనుమతి ఇవ్వడంతో సోమవారం విచారణ చేపట్టారు. ఈ విచారణలో అప్పట్లో నెయ్యి కాంట్రాక్టును మార్చిన అంశం, ఆ నిర్ణయం వెనుక ఉన్న కారణాలు, సంబంధిత వ్యక్తులతో జరిగిన చర్చల పై సీబీఐ అధికారులు పలు ప్రశ్నలు సంధించారు. ఈ వ్యవహారానికి సంబంధించి కీలక సమాచారాన్ని చెవిరెడ్డి నుంచి సేకరించినట్లు సమాచారం. ఇప్పటికే మద్యం కుంభ కోణం కేసులో అరెస్టయిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే వరుస కేసుల్లో ఆయన పై విచారణ కొనసాగుతుండటం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కల్తీ నెయ్యి కేసులో మరిన్ని కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశముందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి.

## విజయవాడలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు..

మొదటి పేజీ తరువాయి
ఈర్ష్య, ద్వేషాలకు దూరంగా ఉండి పాపులను సైతం క్షమించాలని బైబిల్ చెబుతోంది" అని ముఖ్యమంత్రి అన్నారు.

**ఒక్కో ఇటుకా పేరుస్తూ రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం**

"గత ఐదేళ్లలో అసమర్థ పాలన వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. నేను ఎంత లోతుకు పోతే అన్ని ఎక్కువ సమస్యలు కనపడుతున్నాయి. ఇలాంటి విధ్వంసం నా జీవితంలో చూడలేదు. మనో సంకల్పంతో లక్ష్యాన్ని సాధిస్తున్నాం. 18 నెలల్లో రాష్ట్రం నిలదొక్కుకునే పరిస్థితికి తీసుకొచ్చాం. ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ విజయవంతంగా అమలు చేశాం.

క్రైస్తవుల్లో పేద కుటుంబాలు ఉన్నాయి. వారందరికీ ఆర్థిక భరోసా కల్పించాం. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, తల్లికి వందనం, దీపం, ఉచిత బస్సు పథకం, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం,పాస్టర్లకు గౌరవ వేతనాలు ఇలా అన్ని విధాలా క్రిస్టియన్ మైనారిటీలను ఆదుకుంటున్నాం. ప్రత్యేకంగా క్రైస్తవ సమాజం కోసం రూ. 22 కోట్లు ఖర్చు చేసి,44,812 మంది క్రైస్తవ సోదర సోదరీమణులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాం. రాష్ట్రంలోని 8,427 మంది పాస్టర్లకు నెలకు రూ.5,000 చొప్పున గౌరవ వేతనం అందిస్తున్నాం" అని వెల్లడించారు.

**క్రైస్తవులకు ఆర్థిక చేయూత**

"క్రైస్తవుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. 2014 నుంచి 2018 మధ్య 977 చర్చిలకు రూ.70 కోట్లు మంజూరు చేశాం. వీటిలో 377 చర్చిల నిర్మాణం పనులు పూర్తయ్యాయి. గుంటూరులో క్రిస్టియన్ భవన నిర్మాణం కోసం రూ.10 కోట్లు ఖర్చు చేశాం. మరిన్ని నిధులు విడుదల చేసి ఈ ఏడాది క్రిస్టియన్ భవనాన్ని పూర్తి చేసే బాధ్యత తీసుకుంటాం. జెరూసలేం యాత్రకు వెళ్లే క్రైస్తవ సోదర సోదరీమణులకు కూడా ఆర్థిక సాయం చేస్తున్నాం. వార్షిక ఆదాయంరూ. 3 లక్షల లోపు ఉన్న వారికి రూ. 60,000,రూ. 3 లక్షలకు పైగా ఉన్న వారికి రూ. 30,000 ఇస్తున్నాం. దీని కోసం ఈ ఏడాది రూ.1.50 కోట్లు కేటాయించాం" అని చంద్రబాబు తెలిపారు.

**సేవా కార్యక్రమాలకు స్ఫూర్తి క్రైస్తవ మిషనరీలు**

"సమాజ సేవలో క్రైస్తవ సంస్థలు ముందున్నాయి. క్రిస్టియన్ పాఠశాలలు, కాలేజీలు, ఆసుపత్రులు దశాబ్దాలుగా చేస్తున్న సేవలు వెలకట్టలేనివి. ఇవి లక్షల మంది జీవితాల్లో మార్పు తెస్తున్నాయి. మిషనరీ పాఠశాలల్లో చదివి ఎంతోమంది ఎంతో ఉన్నత స్థానాలకు వెళ్లారు. క్రమశిక్షణ, సేవ, నాలెడ్జ్ కు మిషనరీ విద్యా సంస్థలు కేంద్రంగా ఉన్నాయి. గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీ, ఆంధ్ర లయోలా కాలేజీ వంటి క్రిస్టియన్ విద్యా సంస్థలు రాష్ట్రంలో ఎంతోమంది ఉన్నతికి సేవ చేశాయి. ఎన్టీఆర్ కూడా మిషనరీ కాలేజ్ లోనే చదువుకున్నారు. పేదరికం లేని సమాజమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ఇందుకోసం నిర్దుష్ట ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం" అని సీఎం చంద్రబాబు వివరించారు.

## పీవీ సునీల్ కుమార్ పై డీజీపీకి ఫిర్యాదు చేసిన రఘురామ

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, సస్పెండ్ అయిన ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ మధ్య వివాదం తీవ్రస్థాయికి చేరింది. రఘురామపై సునీల్ కుమార్ తీవ్ర ఆరోపణలు చేస్తూ, ఆయన్ను అన్ని పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేయడం తెలిసిందే. దీనికి ప్రతిగా, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న సునీల్ కుమార్‌ను సర్వీస్ నుంచి డిస్మిస్ చేయాలంటూ రఘురామ డీజీపీకి ఫిర్యాదు చేశారు.రఘురామకృష్ణరాజుపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసిందంటూ ఇటీవల సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన సునీల్ కుమార్... ఆయన్ను, ఆయన కుటుంబసభ్యులను అరెస్ట్ చేయడానికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని పేర్కొన్నారు. డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉన్న వ్యక్తి అరెస్ట్ అయితే అది రాష్ట్రానికే తలవంపులని, అమరావతి బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటుందని తెలిపారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, నారా లోకేశ్ కష్టపడి తెస్తున్న పెట్టుబడులు వెనక్కిపోయే ప్రమాదం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.న్యాయం అందరికీ సమానంగా ఉండాలని, తనను సస్పెండ్ చేసినప్పుడు రఘురామను కూడా పదవి నుంచి తప్పించాలని సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. కేసు విచారణ పూర్తయి, న్యాయస్థానంలో నిర్దోషిగా తేలిన తర్వాత ఆయనకు ఏ పదవి ఇచ్చినా అభ్యంతరం లేదని స్పష్టం చేశారు.సునీల్ కుమార్ ఆరోపణలపై రఘురామకృష్ణరాజు తీవ్రంగా స్పందించారు. సునీల్ కుమార్ సర్వీస్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, ఆన్‌లైన్ వీడియోలో చేసిన ఆరోపణలన్నీ అవాస్తవాలని పేర్కొంటూ డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఆయనపై తక్షణమే డిస్మిసల్ ప్రొసీడింగ్స్ ప్రారంభించాలని కోరారు.

## అమరావతిలో కొత్త ప్రాజెక్టులకు ఏపీ ప్రభుత్వం నిర్ణయం..!

మొదటి పేజీ తరువాయి
దిశాని ర్దేశం చేశారు. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ భవనాల టెండర్లను పిలిచే అంశం పై అథారిటీ సమావేశంలో చర్చించారు. రాజధానిలో అఖిలభారత సర్వీసు అధికారుల నివాసాలు, న్యాయమూర్తుల నివాసాల వద్ద అదనపు నిర్మాణాల పైనా సమీక్షించనున్నారు. సీఆర్డీఏ అథారిటీ, ఏపీసీఆర్డీఏ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పాలనా వ్యయం మంజూరు పై సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో మాట్లాడారు. రాజధానిలో కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖకు చెందిన యోగా, నేచురోపతి సెంటర్ నిర్మాణంతో పాటు పలు భూ కేటాయింపులకు సంబంధించి మంత్రుల ఉపసంఘం తీసుకున్న నిర్ణయాల పై చర్చించారు. అమరావతిలో పంపింగ్ స్టేషన్లు, జోన్ 8 లోని ఎల్పీఎస్ పనులకు సంబంధించిన అంశాల పై మాట్లాడారు. ఈ క్రమం లోనే జరీబు- మెట్ట భూముల వర్గీకరణ పై రాష్ట్ర స్థాయి కమిటీని నియమించే అంశం పై నిర్ణయం తీసుకోనుంది అథారిటీ సమావేశం. ఈ సమావేశానికి పురపాలక శాఖ మంత్రి నారాయణ, సీఎస్ విజయానంద్, సీఆర్డీఏ, ఏడీసీఎల్ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# జాతీయ రహదారుల ప్రమాద బాధితులకు ఇక పై రూ. 1.5 లక్షల ఉచిత వైద్యం



**ఇంటర్నెట్ డెస్క్:, పెన్ సత్తా, డిసెంబర్ 22:**
రోడ్డు ప్రమాద బాధితుల అత్యవసర చికిత్సలో ఆర్థిక ఇబ్బందుల వల్ల కలిగే జాప్యాన్ని తొలగించడానికి కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారుల శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాద బాధితులు ఆసుపత్రిలో చేరిన మొదటి ఏడు రోజులకు 1.5 లక్షల వరకు నగదు రహిత వైద్య చికిత్సకు అర్హులవుతారని వెల్లడించింది. దీనికి సంబంధించిన విధి విధానాలను మంత్రిత్వ శాఖ రూపొందిస్తోంది. ఇదివరకు కొన్ని ప్రాంతాలలో పైలట్ ప్రాజెక్ట్‌గా దీన్ని అమలు చేశారు. క్రమంగా దీన్ని పూర్తిస్థాయిలో అమలు లోకి రానుంది. ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రస్తుతం దేశ వ్యాప్తంగా విస్తరించింది. రోడ్డు ప్రమాద బాధితులు చికిత్సకు అవసరమైన డబ్బు కోసం ఇబ్బందులు పడకుండా, కేంద్రం నేరుగా ఆసుపత్రులకు చెల్లింపులు చేసేందుకు ఈ పథకం వీలు కల్పిస్తుంది. ప్రమాదం జరిగిన మొదటి కొన్ని గంటలను గోల్డెన్ అవర్ గా పిలుస్తారు. ఇది బాధితుల ప్రాణాలను కాపాడటంలో చాలా కీలకం. ఈ సమయంలో తక్షణ వైద్య సహాయం అందక పోతే ప్రాణాలు పోవచ్చు. అలా జరక్కుండా చూడటానికి క్యాష్ లెస్ ట్రీట్మెంట్ కార్యక్రమాన్ని రూపొందించింది కేంద్ర ప్రభుత్వం. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ప్రతి ఒక్కరికీ ఆసుపత్రిలో చేరిన మొదటి ఏడు రోజులకు 1.5 లక్షల వరకు నగదు రహిత ట్రీట్మెంట్ లభిస్తుంది. దీనిద్వారా ముందస్తు ఖర్చుల కారణంగా చికిత్స ఆలస్యం కాకుండా నివారించవచ్చు. ప్రమాద స్థలాలకు చేరుకోవడంలో జాప్యాన్ని పరిష్కరించడానికి కూడా కేంద్ర ప్రభుత్వం ఓ నూతన వ్యవస్థను రూపొందిస్తోంది. దీని ద్వారా ప్రత్యేక అంబులెన్స్ లను ఏర్పాటు చేసి, అవి 10 నిమిషాల్లోపు ప్రమాద స్థలానికి చేరుకునేలా చర్యలు తీసుకుంటోంది. ఆధునీకీకరించిన అంబులెన్స్ సేవలను కేంద్రీకృత అత్యవసర హెల్ప్‌లైన్‌తో అనుసంధానించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వాలతో ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉంది. దీని ప్రకారం, ఆధునిక అంబులెన్స్ లను అందుబాటు లోకి తీసుకుని రావాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. అలాగే ప్రమాదం జరిగినట్లు సమాచారం అందిన 10 నిమిషాల లోపు సమయాన్ని క్విక్ రియాక్షన్ గా భావిస్తారు. అంబులెన్స్ నిర్దేశిత సమయం లోపు ప్రమాద స్థలానికి చేరుకున్నట్లయితే- దీనికి అయ్యే ఖర్చులను కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు తిరిగి చెల్లిస్తుంది. ఆయా అంబులెన్ అన్నింట్లోనూ ప్రత్యేక రెస్క్యూ కిట్ లను ఉంటాయి.

# ఆపరేషన్ సింధూర్ టైంలో డివైన్ పవర్ మాకు సాయపడింది



**పాకిస్తాన్ : , పెన్ సత్తా, డిసెంబర్ 22:**
ఏప్రిల్ 22 పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్(పిఓకే) లోని 9 కీలక ఉగ్రస్థావరాల పై దాడులు చేసి వాటిని ధ్వంసం చేసింది. అంతే కాక వందలాది మంది ఉగ్రమూకలను హతమార్చింది. ఈ నేపథ్యంలో తాజాగా పాకిస్థాన్ ఆర్మీ చీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ లో తమకు డివైన్ పవర్(దేవుడి శక్తి) సాయపడిందని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీని పై నెటిజన్లు ఫన్నీ కామెంట్స్ చేస్తున్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ లో ఇటీవల నిర్వహించిన నేషనల్ ఉలేమా కాన్ఫరెన్స్ కు ముఖ్య అతిథిగా విచ్చేసిన పాకిస్థాన్ ఆర్మీ చీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ పై వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్ సైన్యాన్ని దైవశక్తి కాపాడిందని. నాలుగు రోజుల పాటు జరిగిన యుద్ధంలో తాము ఏదో తెలియని దైవానుభూతికి లోనయ్యామని, తాము ఆ విషయాన్ని ఆస్వాదించామని చెప్పుకొచ్చారు. భారత్ తో ఉద్రిక్తతల నేపథ్యంలో అసిమ్ మునీర్ మతపరంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారంటూ పలువురు మండిపడుతున్నారు. ఒకవేళ అల్లా మీకు సాయం చేస్తే, మిమ్మల్ని ఎవరూ అధిగమించలేరు అంటూ అసిమ్ మునీర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అలాగే అఫ్గాన్ తాలిబన్లకు వార్నింగ్ ఇచ్చారు. అఫ్గాన్ తాలిబాన్ లు పాకిస్థాన్ లేదా తెహ్రీక్ ఈ పాకిస్థాన్(టీటీపీ) ను ఎంచు కోవాలని సూచించారు. టీటీపీలో దాదాపు 70 శాతం మిలిటెంట్లు అఫ్గాన్ కు చెందినవారేనని అన్నారు. అలాగే ఇస్లామిక్ స్టేట్ లో జిహాద్ ను ప్రకటించే అధికారం అక్కడి ప్రభుత్వానికి తప్ప మరెవరికీ లేదని అసిమ్ మునీర్ స్పష్టం చేశారు. జిహాద్ కోసం ఫత్వాను ఎవరూ కూడా జారీ చేసేందుకు అధికారం లేదని అన్నారు. ప్రస్తుతం అసిమ్ మునీర్ కు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

# బంగ్లాదేశ్ లో మరో స్టూడెంట్ లీడర్ కాల్చివేత..




**బంగ్లాదేశ్:, పెన్ సత్తా, డిసెంబర్ 22:**
బంగ్లాదేశ్ లో మరో స్టూడెంట్ లీడర్ పై కాల్పులు జరపడం కలకలం రేపుతోంది. నేషనల్ సిటిజెన్ పార్టీ నేత మెతలెబ్ సిగ్దార్ పై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. ప్రస్తుతం అతని పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. ఇటీవల ఇంకిలాబ్ మోంచో నేత షరీఫ్ హాదీ హత్యతో ఆందోళనలు హోరెత్తిన వేళ మరోసారి ఇలాంటి ఘటన జరగడం ఆందోళన కలిగిస్తోంది. ఈ కాల్పుల్లో హాదీ గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం తెలిసిందే. ఇటీవల ఇంకిలాబ్ మోంచో నేత షరీఫ్ హాదీ హత్యతో ఆందోళనలు బంగ్లాదేశ్ వ్యాప్తంగా ఆందోళనలు హోరెత్తాయి. హాదీ మద్దతుదారులు, విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. అవి ఇంకా తగ్గకముందే బంగ్లాదేశ్ లో మరో స్టూడెంట్ లీడర్ పై కాల్పులు జరపడం ఆందోళనకరంగా మారింది. నేషనల్ సిటిజెన్ పార్టీ నేత మెతలెబ్ సిగ్దార్ పై ఇవాళ ఉదయం సౌత్ వెస్టర్న్ ఖులానా సిటీలోని అతని ఇంటిముందే గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. కాల్పుల్లో సిగ్దార్ తలలోకి బుల్లెట్ దూసుకెళ్లింది. సిగ్దార్ ఎడమ వైపు తీవ్రంగా గాయమైంది. హుటాహుటిన అతడ్ని ఆస్పత్రికి తరలించారు, రక్తం బాగా పోయింది. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. హాదీ హత్య జరిగిన కొద్ది రోజులకే ఇలాంటి ఘటన జరగడం పై ఆందోళన వ్యక్తం అవుతోంది. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా నేతృత్వం లోని అవామీ లీగ్ ప్రభుత్వం కూలిపోవడంలో స్టూడెంట్ లీడర్ హాదీ పాత్ర ముఖ్యమైంది. ఈ నెల 12 న అతడి పై కొందరు దాడి చేశారు. సెంట్రల్ ఢాకాలోని బిజోయ్ నగర్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అతడి పై మాస్కులు ధరించిన కొందరు వ్యక్తులు కాల్పులు జరిపారు. దీంతో అతడి పరిస్థితి విషమంగా మారింది. దాంతో అతడ్ని మెరుగైన వైద్యం కోసం సింగపూర్ తరలించారు. చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందాడు హాదీ. దీంతో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. ఈ ఘటనను బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధాని ముహమ్మద్ యూనస్ తీవ్రంగా ఖండించారు. దేశానికి ఇది తీరని లోటు అని పేర్కొంటూ ఒకరోజు సంతాప దినం ప్రకటించారు. నిందితుడ్ని ఎట్టిపరిస్థితిల్లోనూ పట్టుకుంటామని పేర్కొన్నారు. ఈ మేరకు ఈ కేసులో ప్రధాన నిందితుడిగా అనుమానిస్తున్న కరీమ్ మసూద్ కు లుక్ అవుట్ నోటీసులు జారీ చేసింది అక్కడి ప్రభుత్వం. ఇలా వరుస అల్లర్లతో బంగ్లాదేశ్ లో ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. మరోవైపు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికల నేపథ్యంలో ఈ దాడులు ప్రజల్లో ఆందోళనను కలిగిస్తున్నాయి.

# భారత బ్యాంకింగ్ రంగంలో మరో పెద్ద డీల్!

**ఇంటర్నెట్ డెస్క్:, పెన్ సత్తా, డిసెంబర్ 22:**
భారతీయ ప్రైవేట్ బ్యాంకింగ్ సెక్టార్‌లో మరో పెద్ద డీల్ జరుగబోయే సూచనలు కనిపిస్తున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఏఈ) దుబాయ్ బేస్డ్ ఎమిరేట్స్ ఎన్బిడి బ్యాంక్ ఈ కొత్త డీల్ చేయబోతున్నట్టు సమాచారం. ఆర్బిఎల్ బ్యాంక్‌లో 60 శాతం మెజారిటీ స్టేక్‌ను స్వాధీనం చేసుకోవాలని ఎన్బిడి చర్చలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. ఎమిరేట్స్ ఎన్బిడి, యూఏఈ లోని ప్రముఖ బ్యాంకుల్లో ఒకటి. అనుకున్నట్టుగానే ఈ డీల్ విజయవంత మైతే, ప్రమోటర్ కేటగిరీ లేకుండా వంద శాతం పబ్లిక్ షేర్‌హోల్డర్లు కల్గిన ఆర్బిఎల్ బ్యాంక్‌లో విదేశీ ఇన్వెస్టర్ ఎంట్రీ ఇచ్చినట్టు అవుతుంది. భారతదేశం లోని ఆర్బిఎల్ బ్యాంక్‌లో 60% స్టేక్‌ను సుమారు 3 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేయడానికి ఎమిరేట్స్ బ్యాంకు సిద్ధమవుతోంది. ఈ ట్రాన్సాక్షన్ పూర్తిగా ఫ్రెష్ ఎక్విటీ ఇస్యూయన్స్ ద్వారా జరుగుతుందని నివేదికలు సూచిస్తున్నాయి. ఈ ప్రక్రియలో, కంపెనీ తన షేర్ హోల్డర్లకు లేదా ఇతర ఇన్వెస్టర్లకు కొత్త షేర్లను అందజేస్తుంది. దీనివల్ల ఆ ఇన్వెస్టర్లు కంపెనీలో యాజమాన్య హక్కులను పొందుతారు. సదరు కంపెనీ ఇప్పటికే మార్కెట్‌లో ఉన్న షేర్లను అమ్మడం కాకుండా , బదులుగా కొత్త షేర్లను జారీ చేస్తుంది. ఈ నిధులు సాధారణంగా కంపెనీ వృద్ధికి, విస్తరణకు, లేదా ఆర్థిక స్థిరత్వానికి ఉపయోగిస్తారు. ఆర్బిఎల్ మార్గదర్శకాల ప్రకారం, విదేశీ బ్యాంకులు భారతీయ ప్రైవేట్ బ్యాంకుల్లో 49 శాతం వరకు స్టేక్‌ను సొంతం చేసుకోవచ్చు. అయితే మెజారిటీ స్టేక్ కోసం ప్రత్యేక అనుమతులు అవసరమవుతాయి. ఈ డీల్ ఆర్బిఎల్ బ్యాంక్‌కు మరింత క్యాపిటల్ అందించి, ఆ సంస్థ ఇంకా బలోపేతం అవడానికి




ఆస్కారం ఉంటుంది. ఇలాఉంటే, ఎమిరేట్స్ ఎన్బిడి వంటి గ్లోబల్ ప్లేయర్ ప్రవేశంతో, భారత-మధ్యప్రాచ్య బ్యాంకింగ్ టై-అప్‌లు మరింత బలపడతాయని ఆర్థిక నిపుణుల అంచనా. ఈ భారీ డీల్ భారతీయ బ్యాంకింగ్ రంగంలో ఎఫ్డిఐ పెరుగుదలకు ఊతమిస్తుంది.

## ఐటీ చెల్లింపుదారులకు బిగ్ షాక్..!
## ఇక ఈమెయిల్స్, సోషల్ అకౌంట్స్ చెక్ ..!




**ఇంటర్నెట్ డెస్క్:, పెన్ సత్తా, డిసెంబర్ 22:** దేశ వ్యాప్తంగా ఉద్యోగులకు కేంద్రం బిగ్ షాక్ ఇచ్చింది. ఇప్పటికే ఆధార్, పాన్ కార్డుల సాయంతో వ్యక్తిగత గోప్యత లేకుండా చేస్తున్నారన్న ఆరోపణలు ఉండనే ఉన్నాయి. ఇలాంటి సమయంలో వ్యక్తుల గోప్యతకు పూర్తిగా చెక్ పెట్టేలా వారి ఈ మెయిల్స్, బ్యాంక్ అకౌంట్స్, సోషల్ మీడియా అకౌంట్స్ ను కూడా తనిఖీ చేసేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. తాజాగా సవరించిన ఆదాయపు పన్ను చట్టం ప్రకారం కొత్త నిబంధనలు అమల్లోకి రాబోతున్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అంటే కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి కేంద్రం తాజాగా మార్చిన కొత్త ఆదాయపు పన్ను చట్టం అమల్లోకి వస్తుంది. దీంతో పాటే పన్ను అధికారులు మీ బ్యాంక్ ఖాతాలు, ఇమెయిల్ లు, సోషల్ మీడియా ప్రొఫైల్ లు, క్లౌడ్ స్టోరేజ్, ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ లను చెక్ చేయబోతున్నారు. ఆదాయపు పన్ను ఎగవేతల అనుమానం వస్తే చాలు మీ అకౌంట్స్ అన్నీ యాక్సెస్ చేయడానికి చట్ట బద్ధంగా వారికి అధికారం లభించింది. అధికారులు సాధారణంగా నగదు, ఆభరణాలు లేదా పత్రాలు వంటి భౌతిక ఆస్తుల పై దృష్టి పెడతారు. ఇప్పుడు తాజా మార్పులతో ఆ నిఘా, స్వాధీనం అధికారాలు డిజిటల్ స్పేస్ కూ విస్తరించబోతున్నాయి. ప్రస్తుతం ఆదాయపు పన్ను చట్టం, 1961 లోని సెక్షన్ 132 ద్వారా ఈ తనిఖీలు చేస్తున్నారు. నివేదించబడని సంపద గురించి విశ్వసనీయ సమాచారం ఉంటే అధికారులు వ్యక్తుల, సంస్థల ప్రాంగణాల పై దాడి చేసి నగదు, ఆభరణాలు, పత్రాల వంటి భౌతిక ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి అనుమతి ఉంది. కొత్త ఆదాయపు పన్ను బిల్లు దీనికి అప్డేట్ చేసి డిజిటల్ అకౌంట్లకూ విస్తరించారు. తాజా చట్టం ప్రకారం వర్చువల్ డిజిటల్ స్పేస్ గా పిలిచే వాటిని యాక్సెస్ చేయడానికి పన్ను అధికారులకు అనుమతి ఇస్తుంది. ఇందులో ఇమెయిల్ ఖాతాలు, సోషల్ మీడియా ప్రొఫైల్స్, క్లౌడ్ స్టోరేజ్, ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్ వాలెట్లు, ట్రేడింగ్, పెట్టుబడి ప్లాట్‌ఫామ్‌లు, ఆర్థిక లేదా లావాదేవీల డేటాను నిల్వ చేయగల ఇతర ఆన్‌లైన్ రిపోజిటరీలు ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే పన్ను అధికారులు ఇక పై కప్ బోర్డ్‌లు, లాకర్లకే పరిమితం కాకుండా ఇన్‌బాక్స్‌లు, డీఎంలు, డిజిటల్ డాష్‌బోర్డ్‌ల లోపల కూడా ప్రవేశిస్తారు. ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్, ఆన్‌లైన్ ప్లాట్ ఫారమ్‌ల పై ఆధారపడే అధునాతన పన్ను ఎగవేత పద్ధతులను ట్రాక్ చేయడానికి ఈ మార్పు చేస్తున్నారు. అయితే సరైన నిర్వచనం లేకపోతే ఈ నిఘా వ్యక్తిగత గోప్యతకు భంగంగా మారుతుందని అంచనా.

## దీపక్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ఆనంద్ కుమార్




**గుంటూరు, పెన్ సత్తా, డిసెంబర్ 22:** విధినిర్వహణలో అశువులు బాసిన సెంట్రల్ జిఎస్టి ఇన్స్పెక్టర్ పిల్లి దీపక్ కుటుంబానికి సోమవారం కాకాని రోడ్ లోని సెంట్రల్ జిఎస్టీ ఆడిట్ సర్కిల్ కార్యాలయంలో ఆ శాఖ ఆడిట్ కమిషనర్ పులిపాక ఆనంద్ కుమార్ ఆర్థిక సాయం అందచేసారు. దీపక్ తండ్రి ఏసుపాదం, తల్లి శశిదేవి లకు కమిషనర్ ఆనంద్ కుమార్ ఐదు లక్షల రూపాయల చెక్కును అందచేసారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ డిపార్ట్మెంట్ లో చేరిన సంవత్సరానికే దీపక్ అకాల మరణం పొందటం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ పరంగా దీపక్ కు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు సత్వరగా అందించమన్నారు. వ్యక్తిగతంగా దీపక్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. దీపక్ తల్లి తండ్రులు, తమ్ముడు ను కమిషనర్ పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జి ఎస్టీ ఆడిట్ అసిస్టెంట్ కమిషనర్ ఎన్. వి. సుబ్రహ్మణ్యం సూపరింటెండెంట్లు సాయి చరణ్, కొప్పిశెట్టి రామారావు, అస్లాం ఉస్మాని, షబ్బీర్ షేక్, ఎన్. సుధీర్, చాణిక్య, పురుషోత్తం, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే యార్లగడ్డ కలిసిన జంక్షన్ సిఐ



**హనుమాన్ జంక్షన్, పెన్ సత్తా, డిసెంబర్ 22 :** హనుమాన్ జంక్షన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన లోధన రమేష్ ఆదివారం రాత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా యార్లగడ్డకు సీఐ పూల మొక్కను బహుకరించారు. శాంతి భద్రతల పరి రక్షణలో అప్రమత్తంగా ఉండాలని, హనుమాన్ జంక్షన్ సర్కిల్ పరిధిలో ప్రజల సుఖశాంతులతో జీవించేందుకు కృషి చేయాలని యార్లగడ్డ సూచించారు. కోడిపందాలు, పేకాట వంటి జూదాలను నియంత్రించాలని జూదాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

## రష్యా దెబ్బకు ఉక్రెయిన్ విలవిల..

• బాంబులతో విరుచుకుపడుతున్న పుతిన్ సైన్యం!




**ఇంటర్నెట్ డెస్క్:, పెన్ సత్తా, డిసెంబర్ 22:**
రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం కీలక మలుపు తిరుగుతోంది. ఈ రెండు దేశాల మధ్య యుద్ధం ముగింపు లేకుండా మరింత భీకరంగా కొనసాగుతోంది. తాజాగా రష్యా సైన్యం యుద్ధరంగం లోని అన్ని వైపులా వేగంగా ముందుకు దూసుకెళ్తున్నట్లు తెలుస్తోంది. యుద్ధరంగంలో తమ సైన్యం అన్ని వైపులా పురోగతి సాధిస్తోందని, వ్యూహాత్మక ప్రాంతాలను తమ ఆధీనం లోకి తీసుకుంటున్నామని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తాజాగా ప్రకటించింది. మరో వైపు ఉక్రెయిన్ సైన్యం కూడా కొన్ని కీలక ప్రాంతాల నుంచి వెనక్కి తగ్గుతున్నట్లు ధ్రువీకరించింది. అన్ని ఫ్రంట్‌లైన్లలో రష్యా ఆధిక్యం రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం.. గత 24 గంటల్లో రష్యా దళాలు ఉక్రెయిన్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని విరుచుకుపడ్డాయి. పలు కీలకమైన, ప్రయోజనకరమైన ప్రాంతాలను రష్యా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. ఉక్రెయిన్ సైన్యానికి మద్దతుగా నిలుస్తున్న మిలిటరీ-ఇండస్ట్రియల్ ప్లాంట్లు, ఇంధన కేంద్రాలు, రవాణా వ్యవస్థలు, నిల్వ కేంద్రాలపై రష్యా బాంబుల వర్షం కురిపించింది. ఉక్రెయిన్ ఉపయోగిస్తున్న లాంగ్ రేంజ్ డ్రోన్ల తయారీ కేంద్రాలను, విదేశీ కిరాయి సైనికులు ఉంటున్న తాత్కాలిక స్థావరాలను రష్యా క్షిపణులు ధ్వంసం చేశాయి.సూమీ ప్రాంతం నుంచి వెనక్కి తగ్గిన ఉక్రెయిన్ రష్యా దాడుల తీవ్రత పెరగడంతో ఉక్రెయిన్ సాయుధ దళాల జనరల్ స్టాఫ్ కీలక ప్రకటన చేశారు. సూమీ రీజియన్‌లోని క్రాస్నోపిలియా కమ్యూనిటీ సరిహద్దు గ్రామాల్లో రష్యా సైన్యం వేగంగా ముందుకు రావడంతో ఉక్రెయిన్ దళాలు అక్కడ కొన్ని చోట్ల వెనక్కి తగ్గాయి. తమ సైన్యం వెనక్కి తగ్గినప్పటికీ రష్యా దళాలకు భారీ నష్టం చేకూర్చేలా దాడులు కొనసాగిస్తున్నామని ఉక్రెయిన్ వెల్లడించింది. పుతిన్ వ్యూహం ఏంటి? రష్యా తన దాడుల్లో డ్రోన్లు, భారీ బాంబులను పెద్ద ఎత్తున ఉపయోగిస్తోంది. చలికాలం తీవ్రం కావడానికి ముందే ఉక్రెయిన్‌లోని కీలక ఇంధన వనరులను దెబ్బతీసి, ఆ దేశాన్ని మోకాళ్లపైకి తేవాలని పుతిన్ భావిస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. రష్యా దూకుడు చూస్తుంటే మరింత భూభాగాన్ని స్వాధీనం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది.

## పెరగనున్న ఎలక్ట్రిక్ స్కూటర్ల ధరలు



**బిజినెస్ డెస్క్ , పెన్ సత్తా, డిసెంబర్ 22:**
: ఇండియాలో టీవీఎస్, బజాజ్ తర్వాత అత్యధికంగా ఎలక్ట్రిక్ స్కూటర్లను విక్రయించే మూడో అతిపెద్ద సంస్థగా ఏథర్ ఎనర్జీ గుర్తింపు పొందింది. అయితే పెరుగుతున్న ముడి సరుకుల ధరలు, ఎలక్ట్రానిక్ విడిభాగాల వ్యయం కారణంగా తన అన్ని మోడళ్ల పై ధరలను పెంచుతున్నట్లు సంస్థ వెల్లడించింది. ఏథర్ ఎనర్జీ తన స్కూటర్ల ధరలను సుమారు రూ.3,000 వరకు పెంచాలని నిర్ణయించింది. మీరు జనవరి నుంచి రిజ్తా , 450ఎక్స్, 450ఎస్ లేదా 450 అపెక్స్ మోడళ్లను కొనాలనుకుంటే, అదనపు భారాన్ని భరించాల్సిందే. ధరల పెరుగుదలకు కారణాలు: ముడి సరుకుల ధరలు: గ్లోబల్ మార్కెట్‌లో ముడి సరుకుల ధరలు పెరగడం. ఎలక్ట్రానిక్ విడిభాగాలు: ఎలక్ట్రిక్ స్కూటర్లకు అవసరమైన సెన్సార్లు, బ్యాటరీ విడిభాగాల ఖర్చు పెరగడం. కరెన్సీ హెచ్చు తగ్గులు: విదేశీ మారక ద్రవ్యంలో వస్తున్న మార్పుల ప్రభావం. డిసెంబర్ ఆఫర్లను వినియోగించుకోండి: ధరల పెరుగుదల కంటే ముందే స్కూటర్ కొనుగోలు చేయాలనుకునే వారికి ఈ డిసెంబర్ నెల ఉత్తమ సమయం. ఏథర్ ప్రస్తుతం తన కస్టమర్లకు రూ. 20,000 వరకు ప్రయోజనాలను అందిస్తోంది. క్రెడిట్ కార్డ్ ఈఎంఐ పై ఇన్‌స్టంట్ డిస్కౌంట్స్, క్యాష్ ఇన్సెంటివ్స్, కొన్ని మోడళ్ల పై 8 ఏళ్ల వరకు బ్యాటరీ వారంటీలతో పాటు ఆకర్షణీయమైన ఈఎంఐ ఆప్షన్లను అందిస్తోంది. ఏథర్ స్కూటర్ల ప్రస్తుత ధరలు (ఎక్స్-షోరూమ్): పెరుగుదల కంటే ముందు మార్కెట్లో ఉన్న ధరలు ఇలా ఉన్నాయి. ఏతెర్ రిజ్తా: రూ. 1.20 లక్షల నుంచి రూ. 1.61 లక్షల వరకు. ఏథర్ ఇటీవల విడుదల చేసిన 'రిజ్తా' ఫ్యామిలీ స్కూటర్ దేశవ్యాప్తంగా భారీ విజయాన్ని సాధించింది. ఇది ఇప్పటికే 2 లక్షల యూనిట్ల విక్రయాల మైలురాయిని దాటింది. 56 లీటర్ల స్టోరేజ్ స్పేస్, వెడల్పు సీటు, 'స్కిడ్ కంట్రోల్' వంటి అధునాతన సేఫ్టీ ఫీచర్లతో ఇది మధ్యతరగతి కుటుంబాలను ఆకట్టుకుంటోంది. కొత్త ఏడాదిలో ఎలక్ట్రిక్ వాహనం కొనాలనుకునే వారు ఈ నెలే కొనుగోలు చేయడం లాభదాయకం. కేవలం ఏథర్ మాత్రమే కాదు, టీవీఎస్, బజాజ్ వంటి సంస్థలు కూడా ధరల పెంపు దిశగా అడుగులు వేస్తున్నాయి.

## పల్లకి పై స్వామివారి తిరువీధి సేవ.



**నక్కపల్లి, పెన్ సత్తా, డిసెంబర్ 22:** మండలం లోని ఉపమాక గ్రామంలో గరుడాద్రి పర్వతము పై స్వయం వ్యక్తంగా వేంచేసి యున్న కల్కి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా సోమవారం ఏడవ రోజు ఉదయం పెద్ద పల్లకి పై స్వామివారి ఉత్సవమూర్తుల తోనూ, చిన్న పల్లకిలో గోదా దేవి అమ్మవారు ఉత్సవ మూర్తులతో తిరువీధి సేవ ఘనంగా జరిగింది. ఆలయంలో ఉదయం ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో నిత్య కార్యక్రమములు, బాల భోగ నివేదనలు, తిరుప్పావై సేవా కాలము నిర్వహించారు. తరువాత శ్రీదేవి, భూదేవి సమేత కల్కి వెంకటేశ్వర స్వామి ని పెద్ద పల్లకి లోను, గోదాదేవి అమ్మవారిని చిన్నపల్లకి లోనూ అధిషి'ంప చేసి మేళతాళములతోనూ, మంగళ వాయిద్యముల తోనూ గ్రామ తిరువీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు భక్తులు, సుధూరు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు హాజ రయ్యారు.

# హెచ్ 1 బీ ఉద్యోగులకు మైక్రోసాఫ్ట్ కీలక హెచ్చరికలు..!




**ఇంటర్నెట్ డెస్క్, పెన్ సత్తా, డిసెంబర్ 22:**
: అమెరికాలో ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న వలస వ్యతిరేక విధానాల కారణంగా హెచ్ 1 బీ వీసాల భవితవ్యం ప్రమాదంలో పడుతోంది. ఇప్పటికే హెచ్ 1 బీ వీసాల వార్షిక ఫీజును లక్ష డాలర్లకు పెంచేసిన ట్రంప్ ఆ తర్వాత వచ్చిన వ్యతిరేకతతో కొత్త ఉద్యోగులకు మాత్రమే వర్తింపజేశారు. అదే సమయంలో హెచ్ 1 బీ వీసాల రెన్యువల్ కోసం భారత్ తో పాటు స్వదేశాలకు వెళ్లిన ఉద్యోగులకు వాటి ఇంటర్వ్యూలు ఆలస్యం చేయడం ద్వారా ట్రంప్ కక్ష సాధింపులకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో హెచ్ 1 బీ వీసాలు కలిగిన తమ దేశ, విదేశీ ఉద్యోగులకు అమెరికా టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కీలక సూచనలు చేస్తోంది. హెచ్ 1 బీ వీసా కలిగిన తమ ఉద్యోగులు అమెరికాను వదిలి వెళ్లొద్దని తేల్చిచెప్పేసింది. ప్రత్యేకించి రీ-ఎంట్రీకి వారి స్వదేశం నుండి వీసా స్టాంపింగ్ అవసరం కాబట్టి అక్కడికి వెళ్లొద్దని మెయిల్స్ పంపుతోంది. తద్వారా మీరు స్వదేశాలకు వెళ్లి అక్కడే చిక్కుకుంటే తమకు ఎలాంటి సంబంధం లేదని తేల్చేస్తోంది. హెచ్ 1 బీ వీసా అపాయింట్ మెంట్ ల కోసం విదేశాలకు వెళ్లిన కొంత మంది మైక్రోసాఫ్ట్ ఉద్యోగులకు హెచ్చరిక లేకుండా రీషెడ్యూలింగ్ నోటీసులు వచ్చాయని, మరికొందరికి ఇవి తమ దేశాలకు వెళ్లకముందే అందాయని తెలిపింది. దీంతో ప్రస్తుతం అమెరికా బయట ఉన్న వలసేతర ఉద్యోగుల్ని మైక్రోసాఫ్ట్ సంప్రదిస్తోంది. వీసా అపాయింట్ మెంట్ లను రీషెడ్యూల్ చేసినప్పటికీ, వారి ప్రస్తుత వీసా స్టాంపులు కొంత కాలం పాటు చెల్లుబాటులో ఉన్న హెచ్ 1 బీ ఉద్యోగుల కోసం, సరైన పని-అధీకృత కేటగిరీలో వారి ప్రస్తుత వీసాలు గడువు ముగిసేలోపు తిరిగి రావాలని సూచిస్తోంది. ఈ పరిస్థితి వీసా అపాయింట్ మెంట్ లను షెడ్యూల్ చేసిన వ్యక్తులకు వర్తిస్తుంది. ఎందుకంటే వారి వీసాలు త్వరలో ముగుస్తాయి. మరో వైపు అమెరికాలో ఇప్పటికీ ఉన్న మరి కొంత మంది తమ ప్రయాణ ప్రణాళికలను మార్చుకోవడాన్ని పరిశీలించమని కంపెనీ సూచిస్తోంది. ఇది త్వరలో ప్రయాణాలు ప్లాన్ చేసుకున్న వారికి వర్తిస్తుంది. వీసాదారులకు కొత్త వీసా స్టాంప్ జారీ చేసే వరకు తిరిగి రాలేరని, అపాయింట్ మెంట్ ను ముందుకు జరపడం చాలా అరుదని తెలిపింది. అలాంటి సమయంలో పని చేసే విషయంలో మీకు పరిమితులున్నాయని గుర్తుచేసింది. అలాగే అమెరికాలో ఇంకా ప్రయాణ ప్రణాళికలతో ఉన్న రెండవ కేటగిరీ వీసా హోల్డర్లకు, రీ-ఎంట్రీ కోసం కొత్త వీసా అవసరం అవుతుంది కానీ వారి హెచ్ 1 బీ వీసా అపాయింట్ మెంట్ రీషెడ్యూల్ చేయలేదని, కాబట్టి వారు భవిష్యత్తులో ప్రమాదాలను ఎదుర్కోవచ్చని మైక్రోసాఫ్ట్ తెలిపింది. హెచ్ 1 తో పాటు హెచ్4, ఫ్, జే, ఎం వీసాలు కలిగిన వారికీ


# విద్యార్థుల కోసం పర్యావరణ దినోత్సవాల క్యాలెండర్






**విశాఖపట్నం, పెన్ సత్తా, డిసెంబర్ 22:** ప్రతి విద్యార్థి పర్యావరణ హితంగా జీవించేందుకు ఉపకరించే విధంగా పర్యావరణ దినోత్సవ క్యాలెండర్ ని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో రూపొందించింది అని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి జోయింట్ చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ఎస్ శంకర్ నాయక్ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం సాయంత్రం మాధవధార లోని ఎపి కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో ఎన్విరాన్మెంటల్ క్యాలండర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన 25 సంవత్సరాలుగా పర్యావరణ దినోత్సవాలు క్యాలెండర్ ముద్రించడం ఆనందదాయకం అన్నారు. ప్రతి విద్యా సంస్థలో ఈ క్యాలెండర్ వినియోగించి పర్యావరణ దినోత్సవాలు నిర్వహించాలన్నారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ రిసోర్స్ సెంటర్ ద్వారా అన్ని విద్యాసంస్థలకు అవసరమైన పర్యావరణ సమాచారం కూడా అందజేస్తుందన్నారు. ఐక్యరాజ్య సమితి, భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అన్ని పర్యావరణ దినోత్సవాలు ఈ క్యాలెండర్ లో ఉండటం వల్ల విద్యా సంస్థలకు చాలా బాగా ఉపకరిస్తుంది అని పేర్కొన్నారు. ఉచితంగా అందజేస్తున్న ఈ క్యాలెండర్ చాలా విలువైనదిగా గుర్తించి ప్రతి ఒక్కరు పర్యావరణ దినోత్సవాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఇ ఎస్ వీరేంద్ర, ఎస్ ఇ ఎం.రామారావు నాయుడు, విశాఖపట్నం రీజినల్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ పి వి ముకుంద రామారావు, ఇంజనీర్ డాక్టర్ శ్రీనివాస్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జే వి రత్నం, యాక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్ట్స్ ఎన్జిఓ హెచ్ఆర్డి ఐ కృష్ణకుమారి తదితరులు పాల్గొని మాట్లాడారు.

# పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 120 ఫిర్యాదులు.




**విశాఖపట్నం, పెన్ సత్తా, డిసెంబర్ 22:**ప్రతీ సోమవారం నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)కు ఈ రోజు 120 ఫిర్యాదులు రావడం జరిగినది. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్) కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ డాక్టర్.శంఖబ్రత భాగ్చి ప్రత్యక్షముగా పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నందు, నగర సబ్-డివిజన్ ఏ.సి.పి లు, పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ లు, ఎస్సైలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనీ, ఫిర్యాదులు స్వీకరించారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 120 మంది ఫిర్యాదు దారులు వచ్చి తమ తమ సమస్యలను రిపోర్టులు ద్వారా పోలీసు కమిషనర్ కి అందజేసినారు. సిపి ఫిర్యాదులను పరిశీలించి ఫిర్యాదిదారులతో స్వయముగా మాట్లాడి, వారి వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, సమస్యకు సంబంధించి, చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదిదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించవలసినదిగా ఆదేశాలు ఇవ్వడమైనది. ఈ కార్యక్రమంలో ఫిర్యాదుదారులు ఇచ్చిన ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్య భర్తల గొడవలు, మోసానికి సంబంధించినవి, సివిల్ కేసుల విషయం సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి.

# వై.యస్.ఆర్.సి.పిలో భారీ చేరికల పై కూటమి ప్రభుత్వం కుట్రలు.



**విశాఖపట్నం, పెన్ సత్తా, డిసెంబర్ 22:** జిల్లా వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ లోకి ధర్మాన ఆనంద్ వందలాది మంది అనుచరులతో కలిసి సోమవారం చేరేందుకు విఎంఆర్డీఏకు రూ.71,300 చెల్లించి అధికారికంగా అనుమతి తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి వందలాది మంది ప్రజలు, పార్టీ నాయకులు వుడా చిల్డ్రన్ థియేటర్ వద్దకు చేరుకోగా, వైయస్సార్సీపీలో జరుగుతున్న భారీ చేరికలను చూసి ఓర్వలేకపోయిన కూటమి నేతలు అనుమతి లేదంటూ వుడా చిల్డ్రన్ థియేటర్ సిబ్బందితో గేటుకు తాళం వేయించారని నాయకులు ఆరోపణలు చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె. రాజు ఆధ్వర్యంలో చిల్డ్రన్ థియేటర్ గేటు వద్ద తీవ్ర నిరసన వ్యక్తం చేయడం జరిగింది. అనంతరం అదే గేటు వద్ద ధర్మాన ఆనంద్ తో పాటు మరెందరో నాయకులు, కార్యకర్తలకు పార్టీ కండువా కప్పి వైయస్సార్సీపీ లోకి అధికారికంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, శాసన మండలి సభ్యురాలు వరుదు కల్యాణి, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధి, కార్పొరేటర్లు అనిల్ కుమార్ రాజు, పార్టీ నాయుకులు పేర్ల విజయ చంద్ర, అల్లంపల్లి రాజ బాబు, పి.వి.నారాయణ, అంబటి శైలేష్, ముత్తసునిల్, బెవర జగదీష్, పితల వాసు, కనక ఈశ్వర రావు, శివ రెడ్డి, చోలిమ్గి నాగేశ్వర్ రావు, మిసిల ప్రదీప్, పోతిన హరికృష్ణ , నూక రాజు , శివ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# సిఐటియు అఖిలభారత





జాతను ప్రారంభించిన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు.

**పరవాడ, పెన్ సత్తా, డిసెంబర్ 22:** సిఐటియు అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని మండలంలో లంకెలపాలెం జంక్షన్, ఫార్మాసిటీ, తానం, పరవాడ, ఎన్ టి పి సి, సినిమా హాల్ జంక్షన్ లో జాతతో ప్రచారం నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు జాతాను ప్రారంభించారు. జాతాను ఉద్దేశించి శంకర్రావు మాట్లాడుతూ సిఐటియు 18 వ అఖిలభారత మహాసభలు జయప్రదం చేయండి అని పిలుపు నిచ్చారు. సోమవారం లంకెలపాలెం జంక్షన్లో జాతాను ప్రారంభించారు. డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు సిఐటియు అఖిలభారత మహాసభలు విశాఖపట్నం వేదిక కానున్నాయని సిఐటియు ఆవిరభించి 55 సంవత్సరాల కాలంలో మొదటిసారి ఆంధ్రప్రదేశ్లో విశాఖపట్నం మహాసభలకు వేదిక కానున్నదని. ఈ మహాసభలకు 2000 మంది ప్రతినిధులు అన్ని రాష్ట్రాల నుండి, కేంద్రపాలిత ప్రాంతాల నుండి హాజరవుతారని. ఈ మహాసభల్లో కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా చర్చించి భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం అవుతారని. కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని, బయటికి మేడిపండులా ఉన్న ఈ చట్టం లోపల కార్పొరేట్ కంపెనీలకి అనుకూలమైన విధానాల్ని అమలు చేస్తున్నారని. ఇప్పటివరకు ఉన్న హక్కుల్ని కాలరాస్తున్నారని. ఈనేపథ్యంలో జరుగు మహాసభల్లో ముగింపుగా జనవరి 4 న భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారని, ఈ మహాసభలు జయప్రదానికి కార్మికులు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, కే వెంకట్రావు, ఏ రాజా, కే. వెంకు నాయుడు, కే రమణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల వేదికలో 36 ఫిర్యాదుల స్వీకరణ





- సత్వర పరిష్కారానికి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలు.

**అనకాపల్లి, పెన్ సత్తా, డిసెంబర్ 22:** అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మొత్తం 36 ఫిర్యాదులను స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదులలో భూ తగాదాలు -25, మోసపూరిత వ్యవహారాలు - 1, ఇతర విభాగాలకు చెందినవి- 10 వున్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా సంబంధిత అధికారులను ఆదేశిస్తూ ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించాలన్నారు. 7 రోజుల్లోపు విచారణ పూర్తిచేసి తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. చేపట్టిన చర్యల నివేదికలను జిల్లా పోలీసు కార్యాలయానికి తప్పనిసరిగా సమర్పించాలి అని స్పష్టం చేశారు. ఫిర్యాదు దారులతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యలను శ్రద్ధగా విన్న ఎస్పీ. ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన బాధ్యత. ప్రజా సమస్యలను చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించడంలో అనకాపల్లి జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అర్జీదారుల సమస్యల పై అధికారులు నిర్లక్ష్యం వహించరాదు.

- క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించి అర్జీలు పరిష్కరించాలి.
- సమర్పించిన ఫిర్యాదుల సమాచారం కోసం 1 1 0 0 కాల్ చేసి తెలుసుకోవాలి.
- పి జిఆర్.ఎస్.కు 344 అర్జీలు జిల్లా కలెక్టర్ విజయ క్రిష?న్.

**అనకాపల్లి, పెన్ సత్తా, డిసెంబర్22:** తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో పి జి ఆర్ ఎస్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారుల సమస్యలను సంబంధిత అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్జీదారులు సంత ృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని వివిధ శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ విజయ క్రిష?న్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.అర్.ఎస్. కార్యక్రమంలో కలెక్టర్, డి.అర్యో., వై.సత్యన్నారాయణ రావు లు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి తీసుకున్న అర్జీల గురించి వెంటనే సంబంధిత అదికారులను వివరాలు అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి సత్వరమె చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదు అధికారులకు సూచించారు. అనంతరం పరిస్కారం కాని అర్జీల పై సమీక్ష నిర్వహిస్తూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను నిరి?త సమయంలో పరిష్కరించాలని ఆమె తెలిపారు. ప్రజలు అందజేసిన ధరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కరించిన వినతులను ధరఖాస్తుదారునికి తెలియజేయాలని, పరిష్కారం కాని అర్జీల గూర్చి వారికి అందుకుగల కారణాలు వివరంగా తెలియజేయడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా నివారించవచ్చని తెలిపారు. పి జి ఆర్ ఎస్ అర్జీలు జిల్లా అధికారి లాగిన్ లో ఉంటే జిల్లా అధికారి మండల అధికారి లాగిన్ లో ఉంటే మండల అధికారి నేరుగా క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లి, ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించాలని అధికారులను సూచించారు. ప్రతి శాఖ అధికారి వారి శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కార పరిస్థితిని ప్రతిరోజు పర్యవేక్షణ చేసి నిరి?త సమయంలో చర్యలు తీసుకోవాలన్నారు, సమర్పించిన అర్జీల సమాచారం కోసం అర్జీదారులు తమ అర్జీల సమాచారం కోసం 1100 కాల్ చేసి తెలుసు కోవచ్చని కలెక్టర్ అర్జీదారులకు సూచించారు. ఈ రోజు కలెక్టరేట్ లో నిర్వహించిన పి.జి.అర్.ఎస్ లో 344 అర్జీలు స్వీకరించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి జి ఆర్ ఎస్ జిల్లా సమన్వయ అధికారి ఎస్ సుబ్బలక్ష్మి, సి.పి.ఓ. జి.రామారావు, మెప్మా, డి ఆర్ డి ఎ, ఐ సి డి ఎస్, గ ృహనిర్మాణ పథక సంచాలకులు కె సరోజినీ, శచి దేవి, సూర్య లక్ష్మి శ్రీనివాస్, డి ఈ ఓ జి. 1అప్పారావు నాయుడు, జిల్లా ఎక్సయిజ్ అధికారి వి.సుదీర్, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.







# పీఎం పాలెం ఎస్ఐ కె. భాస్కరరావుకు డీజీపీ మెడల్

**విశాఖపట్నం, పెన్ సత్తా, డిసెంబర్ 22:**పీఎం పాలెం పోలీస్ స్టేషన్లో సబ్ ఇన్స్పెక్టర్గా విధులు నిర్వహిస్తున్న కె. భాస్కర రావు (ఎస్ఐ -3903) 2025 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మక డీజీపీ కమెండేషన్ డిస్క్ బ్రాంజ్ పురస్కారానికి ఎంపి కయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. శాంతి భద్రతల పరి రక్షణ, నేరాల నియంత్రణ, దర్యాప్తులో చూపిన అంకిత భావం, క్రమ శిక్షణతో కూడిన సేవలకు గుర్తింపుగా ఆయనకు ఈ అవార్డు లభించింది. ముఖ్యంగా పీఎం పాలెం పరిధిలో ప్రజలతో సమన్వయం పాటిస్తూ శాంతి భద్రతల పరి రక్షణకు ఆయన పోషించిన చురుకైన పాత్రను ఉన్నతాధికారులు అభినందించారు. ఈ సందరరేగా తోటి సిబ్బంది ఉన్నతాధి కారులు భాస్కరరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఉత్తర నియోజకవర్గంలో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**విశాఖపట్నం, పెన్ సత్తా, డిసెంబర్ 22:**ఉత్తర నియోజకవర్గం 49 వ వార్డు, ఏ.ఎస్.ఎస్.ఆర్ నగర్ బర్మా క్యాంప్ యూపీహెచ్సీ సమీపంలో సోమవారం సుమారు రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాస్ రావు, ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి. విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు. వీరితో స్థానిక కార్పొరేటర్ అల్లు శంకర్ రావు, శ్యామల దీపికా హాజరయ్యారు. ఈ సందర్భంగా 49 వ వార్డు పరిధిలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదపడే వివిధ అభివృద్ధి పనులకు అతిథులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో 49 వ వార్డు బీజేపీ, జనసేన, టీడీపీ పార్టీల ప్రముఖ నాయకులు, వార్డు అధ్యక్షులు, మండల అధ్యక్షులు, జోనల్ కమిషనర్ రాము, ఈఈ పద్మావతి, ఏఈ నారాయణరావు, ప్రసాద్, శ్రీధర్, రమేష్, సాగర్, జగదీష్, మురళీశేఖర్, మరియదాసు, నాగమణి, జయశ్రీతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తెలుగుదేశం పార్టీ నూతన సారథికి శుభాకాంక్షలు తెలిపిన తెలుగు యువత సభ్యులు



**కృష్ణాజిల్లా, పెన్ సత్తా, డిసెంబర్ 22:**రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్, బీసీ నాయకులు, వీరంకి వెంకట గురుమూర్తి కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా నియమితులైయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కృష్ణా జిల్లా తెలుగు యువత అధ్యక్షులు దండమూడి చౌదరి (డీసీ) నేతృత్వంలో జిల్లా తెలుగు యువత నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

గురుమూర్తి అనుభవం, నాయకత్వంలో జిల్లాలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందని, రాబోయే రోజుల్లో యువతరం ఉత్సాహంగా పార్టీ కోసం కదం తొక్కుతుందని ఆకాంక్షిస్తున్నామని దండమూడి చౌదరి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత నాయకులు కేదారసిపల్లి శ్రీను, గోవాడ శివ, అహ్మద్ బేగ్, పెదపూడి ఆనంద్, మునగాల నాగ భాస్కర్, పనుగుమాటి సందీప్, వంపుగడవల శివ నాగ ప్రసాద్, వల్లే శివ శంకర్, చాట్ల రమేష్ పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో టీడీపీ సైనికులకు మీరే రథసారథులు

శిక్షణ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి



**మంగళగిరి, పెన్ సత్తా, డిసెంబర్ 22:**
తెలుగుదేశం పార్టీనీ క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే విధంగా వచ్చే ఎన్నికల్లో నిలబడే పార్టీ అభ్యర్థుల విజయానికి క్షేత్రస్థాయిలో టిడిపి సైనికులకు మండల కన్వీనర్లు, కార్యదర్శులు రథసారథులుగా పనిచేయాలని టీడీపీ సీనియర్ నాయకులు, పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి ఇంచార్జి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన టిడిపి మండల అధ్యక్షులు కార్యదర్శులతో అమరావతిలోని మంగళగిరి టిడిపి పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడారు. క్షేత్రస్థాయిలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులు కార్యదర్శులు కమిటీ సభ్యులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థుల విజయానికి మీరే నాంది పలకాలని కోరారు. దేశంలో తెలుగుదేశం పార్టీకి కోటికి మందికి పైగా కార్యకర్తలు ఉన్నారని ఏ ప్రాంతీయ పార్టీకి ఇంతమంది సభ్యత్వం కలిగిన ప్రాంతీయ పార్టీ ఏదీ లేదన్నారు. టిడిపి జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ అభ్యున్నతికి పనిచేస్తూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. 2029 ఎన్నికల్లో చంద్రబాబు మళ్ళీ ఏపీ ముఖ్యమంత్రిగా తిరుగులేని విజయం సాధించే దిశగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమిష్టిగా పనిచేయాలని కోరారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అనుభవం తోపాటు యువ నాయకులు జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నాయకత్వంలో పార్టీలో యువత కు పెద్దపేట వేస్తూ ఏపీని అభివృద్ధి వైపు నడిపించే విధంగా కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కార్యకర్తలు నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులు కార్యదర్శులు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ ఎడ్యుకేషన్ జీవోల అమలుపై అధికారులతో సమీక్ష.

- ఏపీ శాసనసభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ ఛైర్మన్, తోట త్రిమూర్తులు.



**విశాఖపట్నం , పెన్ సత్తా, డిసెంబర్ 22:**రాష్ట్రంలోని మెడికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ప్రభుత్వం జారీ చేసిన జీవోల అమలులో ఎటువంటి పొరపాట్లకు తావు ఉండరాదని ఆంధ్రప్రదేశ్ శాసనసభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్, తోట త్రిమూర్తులు అన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కమిటీ సభ్యులు బండారు శ్రావణి కన్నా లక్ష్మీనారాయణలతో కలిసి హెచ్.ఐ.వి మరియు ఎయిడ్స్ (నివారణ మరియు నియంత్రణ) చట్టం, 2017 అమలుపై రాష్ట్రస్థాయి మరియు జిల్లాస్థాయి వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలోని మెడికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ప్రభుత్వం జారీ చేసిన జీవోల అమలు తీరుపై చైర్మన్, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎయిడ్స్ రిహాబిలిటేషన్ సెంటర్లో హెచ్ఐవి సోకిన వారికి అందిస్తున్న వైద్య వివరాల గురించి అధికారులతో చర్చించారు. జిల్లా కలెక్టర్ ఆమోదముతో హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న సౌకర్యాలు, మందులు పంపిణీ, ఉద్యోగ అవకాశాలు, హెచ్ఐవి ఉన్నవారి పట్ల విద్య, ఆరోగ్య సంరక్షణ, గృహ వసతి మరియు బీమా వంటి అంశాలతో పాటు వ్యాధి ప్రబలకుండా చేపడుతున్న ప్రచారాల వివరాల గురించి చర్చించారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ, చైర్మన్, తోట త్రిమూర్తులు మాట్లాడుతూ ?హెచ్.ఐ.వి మరియు ఎయిడ్స్ (నివారణ మరియు నియంత్రణ) చట్టం, 2017 అమలు తీరుపై క్షుణ?ంగా చర్చించడం జరిగిందన్నారు. ముఖ్యంగా పీజీ వైద్య విద్యార్థులకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఏ మేరకు అమలువుతున్నాయనే అంశంపై అధికారులతో చర్చించినట్లు పేర్కొన్నారు. అసెంబ్లీలో ఆమోదించిన అంశాలు, ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు ఆయా విభాగాల్లో సక్రమంగా అమలువుతున్నాయా లేదా అనే అంశంపై అధికారులు వివరించినట్లు తెలిపారు. నిబంధనల అమలులో ఏవైనా లోపాలు లేదా జాప్యం జరుగుతుంటే వాటిని వెంటనే సరిదిద్దాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, స్వయంగా ఆసుపత్రులను సందర్శించి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించనున్నట్లు చైర్మన్ తెలిపారు. ఎయిమ్స్ వంటి సంస్థలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారం మరియు వాటి పురోగతిపై చర్చించినట్లు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమేనని, ఆ దిశగా వైద్య విద్యా విభాగం పారదర్శకంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. జీవోల అమలుకు సంబంధించిన నివేదికలను అధికారులు అందజేసినట్లు తెలిపారు.ఈ సమావేశంలో వి.విశ్వనాథం, ఏపీఎల్ఏ అసిస్టెంట్ సెక్రటరీ, సౌరబ్ గౌర్, మెడికల్ మరియు ఫ్యామిలీ వెల్ఫేర్ సెక్రెటరీ, జిల్లా జాయింట్ కలెక్టర్ కె మరియు అశోక్, డాక్టర్ కె. నీలకాంతరెడ్డి మేనేజింగ్ డైరెక్టర్ ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, డాక్టర్ కె.పద్మావతి డైరెక్టర్, పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, డాక్టర్ రఘునందన్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, డాక్టర్ కె వి ఎస్ ఎం సంధ్యాదేవి ప్రిన్సిపాల్ ఆంధ్ర మెడికల్ కాలేజ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జగదీశ్వరరావు ఇతర వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హక్కులపై అవగాహనతోనే మోసాలకు అడ్డుకట్ట.

**జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్.**




**విశాఖపట్నం, , పెన్ సత్తా, డిసెంబర్ 22:**హక్కులను ఆయుధాలుగా మలుచుకొని వినియోగదారులు మోసాలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ పిలుపునిచ్చారు. జాతీయ వినియోగదారుల హక్కుల వారోత్సవాల్లో భాగంగా కన్సూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రూపొందించిన 'మేలుకో ... హక్కులు తెలుసుకో' అందరి చుట్టం వినియోగదారుల రక్షణ చట్టం' బ్రోచర్‌ను సోమవారం కలక్టరేట్‌లో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా జేసీ మయూర్ అశోక్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆన్‌లైన్ షాపింగ్ పెరిగిన తరుణంలో సైబర్ మోసాలు, తప్పుడు ప్రకటనల పట్ల కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు వినియోగదారుల కమిషన్లను ఆశ్రయించి సత్వర న్యాయం పొందవచ్చున్నారు. వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, సేవలు, ప్రభుత్వ వినియోగదారులు సమస్యల పరిష్కార ఆన్‌లైన్ వేదికలు, తప్పుడు ప్రకటనల వల్ల కలిగే నష్టాలు, పరిష్కారమార్గాలు, ఫిర్యాదు చేయు విధానం, దరఖాస్తు నమూనాలను బ్రోచర్‌లో పొందుపరచడం ద్వారా వినియోగదారులకు సరైన దిశానిర్దేశం లభిస్తుందన్నారు. వినియోగదారులు తమకు అన్యాయం జరిగినప్పుడు భయపడకుండా ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వినియోగదారుల కమిషన్లు ఇచ్చే తీర్పులు బాధితులకు భరోసా ఇస్తాయని, ప్రభుత్వ ఆన్‌లైన్ వేదికలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చైతన్యవంతమైన వినియోగదారులే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని జేసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వి.భాస్కరరావు, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ మై భారత్ (నెహ్రూ యువ కేంద్రం) డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరావు, కన్సూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ, కన్స్యూమర్ రైట్స్ సేఫ్ గార్డింగ్ సోసైటీ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, జిల్లా రెవెన్యూ అధికారి కె. సత్తిబాబు, యూసీడీ పీడీ సత్యవేణి, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత రామాపాత్రుడు, లీలా ప్రసాద్ రెడ్డి, బంగారు శ్రీనివాస రవి తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణలో సాధించిన నైపుణ్యాలతో వృత్తిలో ఛాలెంజ్ లను ఎదుర్కోవచ్చును





- విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి.
- శిక్షణ కానిస్టేబుళ్ళకు దిశా నిర్దేశం చేసిన డిఐజి గోపీనాథ్ జట్టి, జిల్లా ఎస్పీ.

**విజయనగరం, పెన్ సత్తా, డిసెంబర్ 22:**
ఎపిఎస్పీ బెటాలియన్సుకు ఎంపికైన 208 స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్ళ శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి ముఖ్య అతిధిగా హాజరై, శిక్షణ కార్యక్రమాన్ని డిసెంబరు 22 న పోలీసు పరేడ్ గ్రౌండులో ప్రారంభించారు.

ఈ సందర్భంగా గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ పోలీసు కానిస్టేబుళ్ళుగా ఎంపికై, పోలీసుశాఖ లోకి నూతనంగా ప్రవేసించిన అభ్యర్ధులకు డిఐజి ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. సమాజం పట్ల, నేరాల నియంత్రణ పట్ల పోలీసులకు గురుతర మైన బాధ్యత ఉందన్నారు. విధి నిర్వహణలో పోలీసులు అనేక రకమైన ఛాలెంజ్లను ఎదుర్కొంటున్నారన్నారు. ఇందులో ప్రధానమైన సిబ్బంది కొరత, మారుతున్న నేరాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంను వ ృద్ధి కాకపోవడం, మతపరమైన, శాంతిభద్రతల సమస్యలు తరుచూ ఉత్పన్నమవుతున్నాయన్నారు. ఈ తరహా ఛాలెంజ్ ను ఎదుర్కొనడానికి పోలీసులు మరింతగా వ ృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. ఎటువంటి సమస్యనైనా ఎదుర్కొనేందుకు ప్రతీ పోలీసు ఉద్యోగి సమన్వయంతో, మానవత ద ృక్పథంతో పని చేసి, సమస్యలను పరిష్కరించేందుకు క ృషి చెయ్యాలన్నారు. సాధారణంగా సమాజంలో 95-98 శాతం ప్రజలు చట్టాన్ని గౌరవిస్తుంటారని, మిగిలిన వారిలో 2-5 శాతం వ్యక్తులు మాత్రమే చట్టాన్ని ఉల్లంఘిస్తుంటారన్నారు. వీరిలో ఒక్క శాతం కంటే తక్కువ మంది మాత్రమే నేరాలకు పాల్పడే లక్షణాలుంటాయన్నారు. ఒక్క శాతం కంటే తక్కువ ఉండే నేర ప్రవ ృత్తి కలిగిన వారిపై పోలీసు ఉద్యోగులు ద ృష్టి పెట్టాల్సి ఉంటుందన్నారు. లేకంటే వీరు సమాజంలో అశాంతి, నేరాలకు పాల్పడుతూ, చట్టాన్ని ఉల్లంఘిస్తూ శాంతిభద్రతల సమస్యలకు కారకులవుతుంటారన్నారు. దీనిని ద ృష్టిలో పెట్టుకొని వ్యవహరించాల్సి ఉంటుందని, అందుకు అవసరమైన క్రమశిక్షణ, అంకితభావాన్ని శిక్షణ నుండే అలవర్చుకోవాలన్నారు. శిక్షణకు వచ్చిన వారిలో చాలామంది విద్యావంతులు ఉన్నారని, శిక్షణలో చెప్పిన అన్ని విషయాలను క్షుణ?ంగా తెలుసుకొని, అన్ని రంగాల్లో రాణించి, విధి నిర్వహణలో నిపుణులుగా మారాలన్నారు. సాంకేతికతను వినియోగించుకొని నైపుణ్యాన్ని మెరుగుపర్చుకొని, ఏ విభాగంలోనైనా, ఎక్కడైనా పని చేసేందుకు ప్రతీ ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఏ తరహా నేరాలు, ఎటువంటి శాంతి భద్రత సమస్యలు ప్రస్తుత రోజుల్లో ఉత్పన్నమవుతున్నాయన్న విషయాలను గమనిస్తూ, వాటికి అనుగుణంగా పని చేసేందుకు ప్రతీ ఒక్కరూ క ృషి చెయ్యాలన్నారు. కానిస్టేబుళ్ళు క్షేత్ర స్థాయిలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటారని, వారితో ఏవిధంగా ప్రవర్తించాలి, సమస్యలను పరిష్కరించేందుకు ఏవిధంగా వ్యవహరించాలన్న విషయాలను శిక్షణలో తెలుసుకోవాలన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని మీ భవిష్యత్తుకు పునాదులు వేసుకొని, పోలీసుశాఖకు, ప్రజలకు ఉత్తమ సేవలందించాలని శిక్షణ కానిస్టేబుళ్ళకు విశాఖ పట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి పిలుపునిచ్చారు.

అనంతరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ ఎపిఎస్పీ, సివిల్ వంటి విభాగాలు పోలీసుశాఖలో ఉన్నప్పటికీ అందరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు విభాగానికి చెందిన వారమేనన్న విషయాన్ని మరువవద్దన్నారు. శిక్షణ లో ఔట్ డోర్, ఇండోర్ శిక్షణతోపాటు టెక్నాలజీ, కమ్యూనికేషన్ స్కిల్స్, యోగా, ఆయుధాల వినియోగం, స్విమ్మింగ్, మ్యాప్ రీడింగులో పట్ల శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణలోని ప్రతీ అంశంలోను నైపుణ్యం సాధించి, సైబరు నేరగాళ్ళను అరికట్టే సైబర్ వారియర్స్గా మారాలన్నారు. మారుతున్న నేరాలకు అనుగుణంగా ఉన్నతాధికారులు శిక్షణ లో మార్పులు చేసారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ ముగిసేనాటికి ప్రతీ ఒక్కరూ శారీకంగా, మానసికంగా బలోపేతం కావాలన్నారు. శిక్షణలో పొందిపర్చిన ప్రతీ అంశం కూడా మిమ్ములను వ ృత్తిపరంగా నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకే అని గ్రహించాలన్నారు. శిక్షణలో ప్రాంతాలు, కులాలు, మతాలు అన్న వ్యత్యాసం వద్దని, అందరూ సోదరభావంతో వ్యవహరిస్తూ, అత్యుత్తమ శిక్షణ పొందాలన్నారు. శిక్షణ ఇచ్చేందుకు నిపుణులైన పోలీసు అధికారులను ఎంపిక చేసి, ఫ్యాకల్టీగా నియమించామని, వారు చెప్పిన విషయాలను శ్రద్ధగా విని, వ ృత్తి నైపుణ్యంను మెరుగుపర్చుకొని, సాంకేతికతతో నేరాలను నియంత్రించడం, నమోదైన కేసులను చేధించాల్సి ఉంటుందన్నారు. శిక్షణ పట్ల శ్రద్ధ పెట్టి, క్రమశిక్షణ, అంకిత భావంతో వ ృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. విజయనగరం డిపిటిసిలో శిక్షణ పొందినందుకు ప్రతీ ఒక్కరూ గర్వంతో తలెత్తుకొనేలా శిక్షణ ఉంటుందని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అన్నారు.

డిపిటిసి ప్రిన్సిపాల్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత మాట్లాడుతూ శిక్షణ నిమిత్తం ఎపిఎస్పీ నాలుగు బెటాలియన్స్ శ్రీకాకుళం 39, రాజమహేంద్రవరం 52, ప్రకాశం -53, చిత్తూరు 64 మంది, మొత్తం 208 వచ్చారన్నారు. వీరిలో 147మంది గ్రాడ్యుయేషను, 12మంది పోస్టు గ్రాడ్యుయేషను, 28 మంది బి.టెక్, ముగ్గురు ఎల్.ఎల్.బి., ఇద్దరు జర్నలిజం పూర్తి చేసిన విద్యావంతులున్నారన్నారు. తొమ్మిది మాసాల శిక్షణ తేది. 21-09-2026 తో పూర్తవుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిపిటిసి డిఎస్పీ పి.నారాయణరావు, డిఎస్పీలు ఎం.వీరకుమార్, ఆర్.గోవిందరావు, ఈ. కోటిరెడ్డి, డిపిఓ ఎఓ పి.శ్రీనివాసరావు, పలువురు సిఐలు, రిజర్వు ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, శిక్షణకు వచ్చిన కానిస్టేబుళ్ళు, ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కు గణిత శాస్త్రమే కీలకం





మండల విద్యాశాఖాధికారి కె.నరేష్

**నక్కపల్లి, పెన్ సత్తా, డిసెంబర్ 22:** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు గణిత శాస్త్రమే కీలకమని మండల విద్యాశాఖ అధికారి కె నరేష్ అన్నారు. సోమవారం మండలంలో 13 ఉన్నత పాఠశాలలతో పాటు గురుకులం, కే.జీ.బీ.వి పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో రామానుజన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గణితదినోత్సవ కార్యక్రమాలను ఆయా పాఠశాలల్లో అట్టహాసం గా నిర్వహించారు. అన్ని పాఠశాల ల్లో రామానుజన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వేంపాడు హైస్కూల్ లో హెచ్.ఎమ్. యు.వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు స్థానిక మండల విద్యాశాఖాధికారులు కే.నరేష్,రుత్తల నాగన్నదొర లు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో ముందుగా గణితం ల్యాబ్ ను నరేష్ తో పాటు గ్రామ సర్పంచ్ యేడిద నూకరత్నం ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ గణిత నమూనాలు పలువురు చూపరులను ఆకట్టుకున్నాయి.గణితంలో రామానుజన్ చేసిన అదుతేమైన క ృషిని విద్యార్థులకు వివరించారు. ప్రతీ విద్యార్థి గణితం యొక్క ప్రాముఖ్యత తెలుసుకుని గణితంపై పట్టుసాధించాలన్నారు. గణితం ఇష్టంగా చదవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వివాహితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ వద్దకు స్టీల్ ప్లాంట్ నిర్వాసిత మహిళలు

**నక్కపల్లి, పెన్ సత్తా, డిసెంబర్ 22:**నక్కపల్లి మండలంలో ఏర్పాటు కాబోయ్ స్టీల్ ప్లాంట్ లో భూములు, ఇళ్ళు కోల్పోయిన గ్రామాల్లో వివాహిత మహిళలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి చెల్లిచాలని అమలాపురం, మూలపర్ర, పాటి మీద,చందనాడ తుమ్మల పేట, తమ్మయ్యపేట, బుచ్చిరాజు పేట, బోయపాడు గ్రామాలలో వివాహం అయిన మహిళలు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం అప్పలరాజు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్హులు అందరికీ ఆర్ కార్డు లు ఇవ్వాలని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ తక్షణమే చెల్లించాలని, పునరావాస కాలనీ లో ఇల్లు లు నిర్మించుకునే వరకు గ్రామాలలో ప్రస్తుతం నివశిస్తున్న ఇళ్లు ఖాళీ చేయమని వత్తిడి చేయకూడదని కోరారు. 2013 భూ సేకరణ చట్టం సెక్షన్ 32 ప్రకారం పునరావాస కాలనీ లో విద్యా, వైద్యం ఇలా ఇరవై ఐదు రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. చందనాడ పంచాయతీ తమ్మయ్యపేట పేటలో కొంతమందికి తక్కువ నష్టపరిహారం అంచనా వేశారని ప్రస్తుత ధరలకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లించాలి డిమాండ్ చేశారు.

సాగు,డీ ఫారం భూములలో గల తోటలకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.తమ యొక్క సమస్యలను విన్నవించుకుంటూ నిర్వాసితులు అనకాపల్లి జిల్లా కలెక్టర్



కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈకార్యక్రమంలో రైతు నాయకులు రావి చిన్ని, ఎస్.గోవింద్, ఎం.మహేష్ బాబు, దుర్గ,పద్మ,గోపమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులో అనిల్ మౌనం..దేనికి సంకేతం

**నెల్లూరు, డిసెంబర్ 22, :** నెల్లూరు రాజకీయాలను ఒకప్పుడు శాసించిన వైసీపీ కీలక నేతగా గుర్తింపు పొందిన పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ ప్రస్తుతం పూర్తిగా మౌనంగా ఉండడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీస్తోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిగా, బలమైన గ్రౌండ్ లీడర్‌గా పేరున్న అనిల్ రాజకీయంగా యాక్టివ్‌గా కనిపించకపోవడం వైసీపీకి ఇబ్బందికరంగా మారిందన్న అభిప్రాయం వినిపిస్తోంది.ఇటీవల నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్‌గా ఉన్న స్రవంతి రాజీనామా చేయడం పెద్ద దుమారం రేపింది. ఈ పరిణామంతో ఆ పదవిని టీడీపీ దక్కించుకునే అవకాశాలు పెరిగాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇలాంటి కీలక సమయంలో వైసీపీ తరపున బలమైన నాయకత్వం కనిపించకపోవడం పార్టీ బలహీనతను బయటపెడుతోందని విమర్శలు వస్తున్నాయి.పార్టీలో అనిల్ కుమార్ పాత్ర బలంగా ఉంటే మేయర్ రాజీనామా వరకు వ్యవహారం వెళ్లేదే కాదని వైసీపీ వర్గాల్లోనే చర్చ జరుగుతోంది. పార్టీ నాయకులను ఏకం చేయడం, సమస్యను ముందే చక్కదిద్దడం అనిల్ చేయగలిగేవారని పలువురు అభిప్రాయపడుతున్నారు. కానీ ఆయన నుంచి అలాంటి ప్రయత్నాలు కనిపించకపోవడంతో అసలు కారణం ఏమిటన్న ప్రశ్నలు మొదలయ్యాయి.గత ఎన్నికల్లో నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేసిన అనిల్



ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత మళ్లీ నెల్లూరు నగర రాజకీయాలపై దృష్టి పెట్టాలని ఆయన భావించినా, పార్టీ నుంచి అధికారిక బాధ్యతలు మాత్రం ఇప్పటివరకు అప్పగించలేదు. ఈ అంశమే ఆయన నిరాశకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. పార్టీ శ్రేణులు కూడా అనిల్ వెంట నిలబడకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసిందిఉద్దేశపూర్వకంగానే పార్టీ తనను పక్కన పెట్టిందన్న భావన అనిల్ అనుచరుల్లో బలంగా ఉంది. వైసీపీ నుంచి బయటకు వెళ్లిన కొందరు నాయకుల పాత్ర కూడా దీనికి కారణమని ఆయన భావిస్తున్నట్టు సమాచారం. ఈ అంశాలపై పార్టీ అధిష్టానం స్పందించకపోవడం అనిల్ మౌనానికి మరో కారణంగా మారిందని అంటున్నారు.ఒకప్పుడు తన అనుమతి లేకుండా ఫ్లెక్సీలు కూడా కట్టలేని స్థితి ఉన్న నెల్లూరు సిటీ లో ఇప్పుడు తన మాటకు విలువ లేకపోవడం అనిల్‌కు తీవ్ర మనస్తాపాన్ని కలిగిస్తోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పైగా సొంత బాబాయి టీడీపీలో చేరడం రాజకీయంగా ఆయనకు మరింత ఇబ్బందిగా మారింది. ఈ పరిస్థితుల్లో అనిల్‌కు మళ్లీ ప్రాధాన్యం దక్కుతుందా, లేక నెల్లూరు రాజకీయాల్లో ఆయన పాత్ర ముగింపు దశకు చేరిందా అన్నది కాలమే నిర్ణయించాల్సి ఉంది. ప్రస్తుతం మాత్రం నెల్లూరు రాజకీయాల్లో అనిల్ ప్రభావం కనిపించడం లేదన్నది స్పష్టంగా అర్థమవుతోంది

# అర్ధం కానీ జగన్ వ్యూహం

**తిరుపతి, డిసెంబర్ 22, :** రాజకీయంగా కొన్ని నిర్ణయాలు తీసుకోవడం అత్యంత సాహసం కూడా. చాలా రకాల అంశాలు ప్రభావితం చేస్తాయి. ఈ విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి డిఫెన్స్ లో పడిపోతున్నారు. ఏ నిర్ణయం కూడా సవ్యంగా తీసుకోలేకపోతున్నారు. మునుపటి దూకుడు ఆయనలో కనిపించడం లేదు. రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత ముఖ్యమంత్రి పదవి ఆశించారు జగన్మోహన్ రెడ్డి. ఆ పదవి ఇవ్వకపోయేసరికి పార్టీపై తిరుగుబాటు చేశారు. పార్టీ నుంచి బయటకు వచ్చేసారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేశారు. అప్పట్లో ఢిల్లీ నుంచి గల్లీ వరకు అజయమైనా శక్తిగా ఉంది కాంగ్రెస్ పార్టీ. అయినా సరే ఆ శక్తిని ఢీకొట్టారు జగన్మోహన్ రెడ్డి. కానీ ఇప్పుడు అంతటి శక్తిగా ఉన్న బిజెపిని చూసి మాత్రం భయపడి పోతున్నారు. ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోతున్నారు. స్నేహం కోసం వస్తున్న వారిని దూరం పెడుతున్నారు. ఇష్టమైన వారితో కలవలేక పోతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. భావోద్వేగాలను సైతం వ్యక్తం చేయలేని స్థితిలో ఉన్నారు.సాధారణంగా ప్రతిపక్షంలో ఉన్నవారికి ఏ చిన్నపాటి తోడు దొరికినా వదలరు. కానీ ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి తోటి రాజకీయ పార్టీలను కలుపుకెళ్లే ప్రయత్నం చేయలేకపోతున్నారు. దానికి కారణం భారతీయ జనతా పార్టీ. జాతీయస్థాయిలో ఆ పార్టీకి ఎదురు నిలిచే ఏ పార్టీ కూడా నిలవడం లేదు. అందుకే జగన్ తన పార్టీ కోసం.. తన పార్టీ అస్తిత్వం కోసం బిజెపితో వ్యతిరేకత తెచ్చుకోవడం లేదు. చివరకు బిజెపిని వ్యతిరేకించే పార్టీలను దగ్గర చేసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఏపీలో మూడు పార్టీలు పొత్తులో ఉండగా.. మిగిలినవి కాంగ్రెస్, వామపక్షాలతో పాటు ఉనికి లేని పార్టీలు. తనకు తాను పెద్ద పార్టీగా చెప్పుకునే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వాటిని కలుపు కెళ్లే సాహసం చేయడం లేదు. దానికి కారణం భారతీయ జనతా పార్టీ. ఆ పార్టీకి వ్యతిరేకంగా వెళ్లడమే కాదు.. ఆగ్రహం తెప్పించే ఏ పనికి కూడా జగన్మోహన్ రెడ్డి ముందుకు రావడం లేదు. అయితే జగన్మోహన్ రెడ్డి ని సింహం, ఢిల్లీని గడగడ లాడించిన నాయకుడు వంటి స్లోగన్స్ తో ఆకాశానికి ఎత్తేస్తుంటారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు. కానీ ఇప్పుడు బీజేపీ విషయంలో తమ అధినేత అనుసరిస్తున్న వైఖరి వారికి సైతం మింగుడు పడడం లేదు.ఇటీవల ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అంశంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళనను తీవ్రతరం చేసింది. అదే అంశంపై సిపిఐ పోరాటం చేస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉద్యమాన్ని అభినందిస్తోంది. అయితే సిపిఐ వైఖరి చూస్తుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో అడుగులు వేయాలని అనిపిస్తుంది. కానీ జగన్మోహన్ రెడ్డి నుంచి ఎటువంటి పిలుపు లేదు కదా.. సంకేతాలు కూడా లేవు. ప్రజల్లో మార్పు ప్రారంభమైందని జగన్ అంచనాలు వేస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామన్న ధీమాతో ఉన్నారు. కానీ కొన్ని వర్గాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అంటేనే అసంతృప్తితో ఉన్నాయని.. ఆగ్రహంతో ఉన్నాయని తెలుసుకోలేకపోతున్నారు. 2024 ఎన్నికలకు ముందు చంద్రబాబు విషయంలో బిజెపి వైఖరి వేరేలా ఉండేది. ఎప్పుడైతే పవన్ ముందుకు వచ్చి టిడిపి తో పొత్తు ప్రకటన చేశారో.. క్రమేపి



బిజెపి వైఖరిలో మార్పు వచ్చింది. ఇప్పుడు కూడా సిపిఐ ద్వారా మిగతా రాజకీయ పక్షాలను తన వైపు తెచ్చుకోవచ్చు జగన్మోహన్ రెడ్డి. కానీ బిజెపి విషయంలో వెనుకడుగు వేస్తున్నారు. ఇలా ఆలోచనకు వెళ్తే మాత్రం చాలా కష్టం

# రైటర్స్ కథపై ఆసక్తికర చర్చమోడీ తర్వాత ప్రధానిగా చంద్రబాబు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 22, :** భారత రాజకీయాల్లో మోడీ తర్వాత ఎవరు? అనే ప్రశ్న ఎప్పుడూ ఆసక్తికరమే. అయితే, ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ ఇటీవల ప్రచురించిన కథనం ఈ చర్చను మరో మలుపు తిప్పింది. 2029 నాటికిప్రధాని మోడీ వయస్సు 79 ఏళ్లకు చేరుతుందని, ఆ సమయంలో ఆయన క్రియాశీల రాజకీయాల నుండి తప్పుకుంటే వారసులెవరు అనే కోణంలో రాయిటర్స్ ఒక ఆసక్తికర విశ్లేషణను బయటపెట్టింది.రాయిటర్స్అంచనా ప్రకారం, బిజెపిలో మోడీ తర్వాత అత్యంత శక్తివంతమైన నేతగా ఉన్న అమిత్ షా మొదటి వరుసలో ఉన్నారు. పార్టీ యంత్రాంగంపై ఆయనకున్న పట్టు, వ్యూహకర్తగా ఆయనకున్న గుర్తింపు దీనికి ప్రధానకారణాలు. ఇక మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక నేతగా ఉన్న దేవేంద్ర ఫడ్నవీస్ పేరును కూడా రాయిటర్స్ పరిగణనలోకి తీసుకోవడం గమనార్హం. అయితే, క్షేత్రస్థాయిలో అత్యంత ప్రజాదరణ పొందిన, హిందుత్వ బ్రాండ్అంబాసిడర్ గా పేరుగాంచిన యోగి ఆదిత్యనాథ్ పేరును రాయిటర్స్ విస్మరించడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రంలో వరుస విజయాలు సాధిస్తూ, మోడీ తర్వాత అంతటిఫాలోయింగ్ ఉన్న నేతను కాదని ఫడ్నవీస్ పేరును తెరపైకి తేవడం వెనుక రాయిటర్స్ లాజిక్ ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారింది.. ప్రధాని రేసులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ పేర్లనుప్రస్తావించడం. ఒకవేళ 2029లో బిజెపికి స్పష్టమైన మెజారిటీ రాకుండా, ఎన్డీయే కూటమిలోని ప్రాంతీయ పార్టీలు బలంగా ఉంటే, అప్పుడు దక్షిణాది నేతగా చంద్రబాబుకు అవకాశం దక్కవచ్చని రాయిటర్స్అభిప్రాయపడింది. కానీ ఇక్కడ కొన్ని ప్రాథమిక వాస్తవాలను రాయిటర్స్ విస్మరించినట్లు కనిపిస్తోంది. 2029 నాటికి మోడీకి 79 ఏళ్లు వస్తాయని ఆయనను పక్కన పెడితే, చంద్రబాబు కూడా అదే వయస్సులో ఉంటారు.వాస్తవానికి మోడీ కంటే చంద్రబాబు 6 నెలలు పెద్ద. వయస్సు రీత్యా మోడీ తప్పుకుంటే, అంతకంటే పెద్దవారైన చంద్రబాబును బిజెపి అగ్రనాయకత్వం ఎలా అంగీకరిస్తుంది?. జాతీయ రాజకీయాల్లో బిజెపి నేడు అత్యంతశక్తివంతంగా ఉంది. గడ్కరీ, రాజ్ నాథ్ సింగ్ వంటి హేమాహేమీలను కాదని, ఒక ప్రాంతీయ పార్టీ నేతకు ప్రధాని పీఠాన్ని అప్పగించే పరిస్థితి ప్రస్తుతం కనిపించడం లేదు.చంద్రబాబు కానీ, లోకేశ్ కానీ ఏనాడూ తమకుప్రధాని కావాలనే ఆకాంక్ష ఉన్నట్లు ఎక్కడా వ్యక్తం చేయలేదు. "నా దృష్టి అంతా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పైనే" అని చంద్రబాబు పలుమార్లు స్పష్టం చేశారు. లోకేశ్ కూడా రాష్ట్ర రాజకీయాల్లోనే తన ముద్ర వేసేందుకుప్రయత్నిస్తున్నారు. రాజకీయ వర్గాల్లో సాగుతున్న ప్రచారం ప్రకారం.. 2029లో కేంద్రంలో ఎన్డీయే అధికారంలోకి వస్తే, చంద్రబాబుకు జాతీయ స్థాయిలో గౌరవప్రదమైన రాష్ట్రపతి లేదా గవర్నర్ వంటి పదవులుదక్కవచ్చని, ఆ సమయంలో రాష్ట్ర బాధ్యతలను లోకేశ్ కు అప్పగించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. 'ప్రధాని పదవి' అనేది మాత్రం అతిశయోక్తిగానే తోస్తోంది.అంతర్జాతీయ మీడియా సంస్థలు ఒక్కోసారిక్షేత్రస్థాయి సమీకరణాలను వదిలేసి, కేవలం గణాంకాలు లేదా పాత రాజకీయ ముద్రల ఆధారంగా విశ్లేషణలు చేస్తుంటాయి. రాయిటర్స్ కథనం కూడా ఆ కోవలోకే వస్తుంది. దక్షిణాదిలో టీడీపీకున్న పట్టును గుర్తించినరాయిటర్స్, దేశ ప్రధాని పదవి విషయంలో మాత్రం భారతీయ రాజకీయాల్లోని 'వయస్సు పరిమితులు', 'బిజెపి అంతర్గత పట్టు' వంటి కీలక అంశాలను సరిగ్గా అంచనా వేయలేకపోయిందనిపిస్తోంది. ఏదిఏమైనా, 2029కి ఇంకా చాలా సమయం ఉంది. పైగా తాను తప్పుకుంటానని మోడీ ఇంతవరకూ ప్రకటించలేదు. పార్టీ కూడా ఆయన్ను తప్పించే ఆలోచనలో లేదు. అయినా అప్పటి రాజకీయ పరిస్థితులు, బిజెపిబలాబలాలను బట్టి ఈ సమీకరణాలు ఎటువైపు అయినా మారవచ్చు.

## సామాన్యు లను దోచు కోవడానికి మోదీ ప్రభుత్వం ఏ అవకాశాన్నీ వదలడం లేదు ఖర్గే

మొదటి పేజీ తరువాయి

రైల్వే ఛార్జీలను పెంచి మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజల పై భారం మోపిందని ఖర్గే ఆరోపించారు. రైల్వేలు ప్రస్తుతం నిర్లక్ష్యం, ఉదాసీనత, నకిలీ ప్రచారానికి గుర్తుగా ఉన్నాయి అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రత్యేక రైల్వే బడ్జెట్‌ను రద్దు చేసినప్పటి నుండి రైల్వేలలో జవాబుదారీతనం తగ్గిపోయింది. ప్రస్తుతం దిగజారుతున్న రైల్వే పరిస్థితిని పరిష్కరించడం కంటే కేంద్ర ప్రభుత్వం ప్రచారం పైనే దృష్టి పెట్టిందని ఖర్గే కేంద్రం పై విరుచుకుపడ్డారు. మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజలను దోచు కోవడానికి ఏ అవకాశాన్నీ వదలడం లేదు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టబోయే కొన్నిరోజుల ముందు మరోసారి రైల్వేఛార్జీలను పెంచింది. ఈ సంవత్సరం లోనే రైల్వే ఛార్జీలు పెంచడం ఇది రెండోసారి. ప్రత్యేక రైల్వే బడ్జెట్ లేకపోవడంతో జవాబుదారీతనం నశించింది. మోదీ ప్రభుత్వం కాంక్రీటు డెలివరీ కటే నకిలీ ప్రచారంలో బిజీగా ఉండటంతో రైల్వే కుశించిపోతోంది అని ఖర్గే ఎక్స్ పోస్టులో ఆరోపించారు. ఈ సందర్భంగా ఖర్గే రైల్వే ప్రమాదాలను ఎత్తి చూపారు. ఎన్‌సిఆర్‌బి సమాచారం ప్రకారం 2014 -2023 వరకు 2.18 లక్షల మంది రైల్వే ప్రమాదాల్లో మృతి చెందారు. ఈ లెక్కల్నిబట్టి చూస్తే రైలు ప్రమాదం సురక్షితం కాదని ఆయన నొక్కి చెప్పారు. రైల్వేల పై ఊదరగొడుతున్న ఐదేళ్ల హైప్‌లో ఎలాంటి సీరియస్‌నెస్ లేదు. కవాచ్ (ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్) 3 కంటే తక్కువ మార్గాలను, 1 శాతం కంటే తక్కువ లోకోమోటివ్‌లను కవర్ చేస్తుంది. ఈ కవాచ్ అనేది మోదీ ప్రసంగాల్లో మాత్రమే ఉంటుంది. నిజంగా ఉండదు. రైల్వేలో 3.16 లక్షల ఖాళీలున్నాయి. యువత పర్మినెంట్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. కాంట్రాక్టు నియామకాలు పెరుగుతున్నాయని (జీత భత్యాల పై తాజా వార్షిక నివేదికను ఉటంకిస్తు) ఖర్గే విమర్శించారు.

శిక్షణ, మానవ వనరుల అభివృద్ధికి నిధులు విడుదల సరిగ్గా లేవు. 2023-24లో 42 శాతం నిధులు ఖర్చయితే 2024-25 లో 68 శాతం మాత్రమే ఉపయోగించ డబడ్డాయి. లోకో పైలట్లు ప్రాథమిక విరామాలను నిరాకరించింది. పార్లమెంటు స్టాండింగ్ కమిటీ నివేదిక ప్రకారం అమృత్ భారత్ కింద 453 కి ఒక స్టేషన్ మాత్రమే అప్‌గ్రేడ్ చేయడం జరిగింది. ఇదే మోదీ ప్రభుత్వం అభివృద్ధి పై వేస్తున్న క్రూరమైన జోక్ అని ఖర్గే మండి పడ్డారు. రైళ్లలో ఎటిఎంలను ప్రమోట్‌కి 2,640 కోట్ల రూపాయలు రైల్వేలు నష్టపోయాయని కాగ్ 2024 నివేదిక వెల్లడించింది. అయితే మరో వైపు సీనియర్ సిటిజన్ రాయితీలు రద్దు చేయడం వల్ల వృద్ధుల నుంచి రూ. 8,913 కోట్లను వసూలు చేయడం జరిగింది అని ఖర్గే ప్రస్తావించారు. 160 కిలో మీటర్ల వేగంతో పరుగెత్తాల్సిన వందే భారత్ రైలు 76 కిలో మీటర్ల వేగంతో పరుగెత్తుతుందని, ఇదే మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి అని ఖర్గే ఆరోపించారు.

## నిఫ్ట్ 2026 ప్రవేశాలు:

**హైదరాబాద్** వరంగల్ వెస్ట్, డిసెంబర్ 22(ఎ.ఎం.ఎస్): భారత ప్రభుత్వ జౌళి శాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (ఔఎఉ), 2026 విద్యా సంవత్సరానికి ప్రవేశాలను ఆహ్వానిస్తోంది. డిజైన్, మేనేజ్ మెంట్ మరియు టెక్నాలజీ రంగాలలో నిపుణులను తయారు చేసే నిఫ్ట్, గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ మరియు డాక్టోరల్ స్థాయిలలో కోర్సులను అందిస్తుంది. రిజిస్ట్రేషన్ కు చివరి తేదీ జనవరి 8, ఆలస్య రుసుముతో జనవరి 10 వరకు, ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 8న నిర్వహించబడుతుంది. ఫలితాలు ఏప్రిల్ లో వెలువడతాయి.

## పాముకాటుతో రైతు మృతి: లెంకాలపల్లిలో విషాదం

**వర్ధన్నపేట, డిసెంబర్ 22 :** లెంకాలపల్లి గ్రామంలో సోమవారం పాముకాటుతో చికిత్స పొందుతున్న రైతు యాదండ్ల చిన్న కొమురయ్య (50) మృతి చెందాడు. శుక్రవారం మొక్కజొన్న పొలంలో పనిచేస్తున్నప్పుడు పాము కాటు వేయడంతో, కుటుంబ సభ్యులు అతన్ని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున కొమురయ్య తుదిశ్వాస విడిచాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్ నాయకుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

**పరకాల, డిసెంబర్ 22 :** హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెం గ్రామంలో సోమవారం, 64వ డివిజన్ మడికొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జిట్టా నాగరాజు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి తొట్ల రాజు యాదవ్, కొప్పుల నవీన్ యాదవ్, పెనుకుల వినయ్, జిట్టా ప్రవీణ్ చంటి, పవన్, బన్నీ, అశోక్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పరకాల నూతన సర్పంచ్ కవిత మధుకు ఘన సన్మానం

**నర్సంపేట, డిసెంబర్ 22 :** హనుమకొండ జిల్లా పరకాల మండలం మల్లక్క పేట గ్రామ పంచాయతీ నూతన సర్పంచిగా శ్రీమతి. దొమ్మాటి కవిత మధు సోమవారం రోజు పదవీ బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ఎమ్మెల్యే రేవూరి నాయకత్వంలో, టీపీసీసీ మాజీ ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్య దీవెనలతో గెలుపొందిన ఆమెను పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మడికొండ బ్రదర్స్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పెన్ సత్తా
మంగళవారం 23 డిసెంబర్ 2025

## జెమీమాకు ప్రమోషన్: ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్న స్టార్ బ్యాటర్..!






న్యూఢిల్లీ: వన్డే వరల్డ్ కప్ సెమీస్‌లో ఆస్ట్రేలియాపై అజేయ శతకంతో టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించిన భారత మహిళా స్టార్ క్రికెటర్ జెమీమా రోడ్రిగ్స్‌కు ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ప్రమోషన్ దక్కనుంది. ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా జెమీమా బాధ్యతలు చేపట్టనుంది. దీనిపై రేపో, మాపో ఢిల్లీ ఫ్రాంచైజీ నుంచి అధికారిక ప్రకటన వెలువడనున్నట్లు సమాచారం. 2026 సీజన్‌లో ఢిల్లీ కెప్టెన్సీ పగ్గాలను భారత క్రికెటర్‌కు అప్పగించాలనుకుంటున్నామని ఢిల్లీ ఫ్రాంచైజ్ సహ యజమాని పార్థ్ జిందాల్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఢిల్లీ కెప్టెన్‌గా జెమీమా ఎంపిక లాంఛనం కానుందని క్రీడా వర్గ్లో ప్రచారం జరుగుతోంది.

**మెగ్ లానింగ్ ఔట్..!**

డబ్ల్యూపీఎల్‌లో మెగ్ లానింగ్ నేతృత్వంలో ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా మూడు సీజన్లు ఫైనల్‌కు చేరుకుంది. కానీ మూడుసార్లు ఢిల్లీకి నిరాశే ఎదురైంది. సీజన్ మొత్తం అద్భుతంగా రాణించిన డీసీ టైటిల్ ఫైట్‌లో చిత్తయింది. ఈ నేపథ్యంలో 2026 సీజన్ కోసం మెగ్ లానింగ్‌ను డీసీ రిటైన్ చేసుకోలేదు. వేలంలో మెక్ లానింగ్‌ను యూపీ వారియర్స్ దక్కించుకుంది. దీంతో లానింగ్ స్థానంలో స్వదేశీ ప్లేయర్ కెప్టెన్‌గా ఉండాలనే ఉద్దేశంతో జట్టు పగ్గాలను జెమీమాకు అప్పగించాలని డీసీ మేనేజ్మెంట్ భావిస్తోంది.

అంతేకాకుండా జెమీమా ఎంపికకు ఆమె ప్రపంచకప్ ప్రదర్శనలను కూడా డీసీ పరిగణలోకి తీసుకున్నట్లు టాక్. ఇవన్నీ సమీకరణాలను బేరీజు వేసుకుని చివరకు జెమీమాకు నాయకత్వ బాధ్యతలు అప్పగించాలని డీసీ డిసైడ్ అయినట్లు సమాచారం. మరీ మూడుసార్లు ఫైనల్‌లో ఇంటి ముఖం పట్టిన డీసీ.. జెమీమా నాయకత్వంలోనైనా టైటిల్ ఆకలిని తీర్చుకుంటుందో లేదా చూడాలి. 2025, జనవరి 7 నుంచి ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం కానుంది.

## క్రికెట్ కు గుడ్ బై చెప్పిన కృష్ణప్ప గౌతమ్



భారత క్రికెటర్, కర్ణాటక ఆల్‌రౌండర్ కృష్ణప్ప గౌతమ్ తన ప్రొఫెషనల్ క్రికెట్ కెరీర్‌కు ముగింపు పలికాడు. సోమవారం అన్ని ఫార్మాట్ల నుంచి రిటైర్ అవుతున్నట్లు అధికారికంగా ప్రకటించాడు. బెంగళూరులోని కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (ఖూజాూ) మీడియా లాంజ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఈ నిర్ణయాన్ని వెల్లడించాడు. ఈ కార్యక్రమానికి కేఎస్‌సీఏ అధ్యక్షుడు వెంకటేశ్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు సుజిత్ సోమసుందర్, కార్యదర్శి సంతోష్ మీనన్ హాజరయ్యాడు37 ఏళ్ల గౌతమ్, 2021 జూలై 23న శ్రీలంకపై తన ఏకైక అంతర్జాతీయ వన్డే మ్యాచ్ ఆడారు. ఆ మ్యాచ్‌లో వికెట్ కీపర్ మినోద్ భానుకను ఔట్ చేసి తన ఏకైక అంతర్జాతీయ వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు.

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ద్వారా కృష్ణప్ప గౌతమ్ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాడు. ఐపీఎల్ 2021 వేలంలో చెన్నై సూపర్ కింగ్స్ అతడిని రూ. 9.25 కోట్లకు కొనుగోలు చేయడంతో, అప్పటివరకు అత్యంత ఖరీదైన అన్‌క్యాప్డ్ భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. తన ఐపీఎల్ కెరీర్‌లో ముంబై ఇండియన్స్, రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. 2024 మే నెలలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచే ఐపీఎల్‌లో అతడి చివరి మ్యాచ్.

ఐపీఎల్‌లో 36 మ్యాచ్‌లలో, ఈ ఫ్లెక్సిబుల్ బౌలింగ్ ఆల్‌రౌండర్ 247 రన్స్ స్కోర్ చేశాడు... అలాగే 21 వికెట్లు తీశాడు. దేశీయ క్రికెట్‌లోనూ మెరుగైన ప్రదర్శన చేశాడు, 32 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో 737 రన్స్ చేసి, 116 వికెట్లు సాధించాడు. లిస్ట్ ఎ మ్యాచ్‌లలో అతను 32 మ్యాచ్‌లలో 400 రన్స్ స్కోర్ చేసి, 51 వికెట్లు తీశాడు, అతని టీ20 కెరీర్‌లో 49 మ్యాచ్ లలో 454 రన్స్ మరియు 32 వికెట్లు సాధించాడు.ముఖ్యంగా 2019 కర్ణాటక ప్రీమియర్ లీగ్‌లో బళ్లారి టస్కర్స్ తరఫున ఆడుతూ ఒకే మ్యాచ్‌లో 56 బంతుల్లో 134 పరుగులు చేసి, ఆ తర్వాత బౌలింగ్‌లో 15 పరుగులకే 8 వికెట్లు పడగొట్టి చరిత్ర సృష్టించాడు. ఈ అసాధారణ ప్రదర్శన అతని కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలిచిపోయింది.

## మ్మురేపుతోన్న RCB రూ.2 కోట్ల బౌలర్: కేవలం మూడు మ్యాచుల్లోనే 23 వికెట్లు పడగొట్టిన జాకబ్ డఫీ






వెస్టిండీస్‌తో జరిగిన మూడు మ్యాచుల టెస్ట్ సిరీస్‌లో న్యూజిలాండ్ పేసర్ జాకబ్ డఫీ దుమ్మురేపాడు. మూడు మ్యాచుల్లో 23 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికయ్యాడు. తద్వారా జాకబ్ డఫీ రెండు అరుదైన రికార్డులు సృష్టించాడు. న్యూజిలాండ్ తరుపున ఒక క్యాలెండర్ ఇయర్ (2025)లో అత్యధిక వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. ఈ ఏడాది 36 మ్యాచ్‌ల్లో 81 వికెట్లు పడగొట్టిన డఫీ.. న్యూజిలాండ్ క్రికెట్ దిగ్గజం రిచర్డ్ హాడ్లీ రికార్డును బ్రేక్ చేశాడు. 1985లో 23 మ్యాచ్‌ల్లో రిచర్డ్ హాడ్లీ 79 వికెట్లు తీయగా తాజాగా ఈ రికార్డును డఫీ అధిగమించాడు. దీంతో పాటు మరో రికార్డును డఫీ తన పేరిట లిఖించుకున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో 23 వికెట్లు తీసి.. స్వదేశంలో జరిగిన సిరీస్‌లో అత్యధిక వికెట్లు సాధించిన న్యూజిలాండ్ పేసర్ గా రికార్డ్ క్రియేట్ చేశాడు. గతంలో ఈ రికార్డ్ న్యూజిలాండ్ స్టార్ బౌలర్ బౌల్ట్ పేరిట ఉండేది. బౌల్ట్ 2013లో వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో 20 వికెట్లు పడగొట్టాడు. ఇదిలా ఉంటే.. జాకబ్ డఫీ రాణించడంతో ఆర్సీబీ యాజమాన్యంతో పాటు ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. ఎందుకంటే ఇటీవల జరిగిన 2026 ఐపీఎల్ మినీ వేలంలో డఫీని ఆర్సీబీ కొనుగోలు చేసింది. భారీ అంచనాల నడుమ వేలంలోకి వచ్చిన డఫీని ఆర్సీబీ కేవలం 2 కోట్ల రూపాయలకే వ్యూహాత్మకంగా దక్కించుకుంది. ఈ క్రమంలో డఫీ వికెట్ల మీద వికెట్లు తీస్తుంటే ఆర్సీబీ అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. సొంత దేశం తరుపున దుమ్మురేపుతోన్న డఫీ.. ఐపీఎల్‌లో ఆర్సీబీ తరుపున ఎలా రాణిస్తాడో చూడాలి మరీ.

## ఆ హిట్ తో 100 కోట్ల ప్రాజెక్ట్ లో ఛాన్స్!






%--%హలో%--% తో ఎంట్రీ ఇచ్చిన కల్యాణి ప్రియదర్శన్ జర్నీ టాలీవుడ్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఆ సినిమా ఫలితంతో వెంట వెంటనే వరుసగా తెలుగు అవకాశాలు అందుకుంది. %--%చిత్రలహరి%--, --%రణరంగం%--% లాంటి చిత్రాల్లో మెరిసినా? అటుపై అమ్మడు మాత్రం టాలీవుడ్ లో బిజీ కాలేకపోయింది. దీంతో %--%హీరో%--% సినిమాతో కోలీవుడ్ లోనూ ఎంట్రీ ఇచ్చింది. అక్కడా సొగసరి కెరీర్ పుంజుకోలేదు. రెండు..మూడు చిత్రాలతోనే అక్కడా వడి వడిగాన అడుగులు వేసింది. అనంతరం మాలీవుడ్ లో మాత్రం బిజీ అయింది. రెండు..మూడేళ్లగా అవకాశాలు బాగానే అందుకుంటుంది.

**కార్తీ సినిమాకు కలిసొచ్చే బ్యూటీ:**

ఇటీవల విడుదలైన - లోక చాప్టర్ వన్ చంద్ర - తో భారీ విజయం అందుకుంది. కల్యాణీ కెరీర్ లో అతి పెద్ద బ్లాక్ బస్టర్ గా నిలిచిందా చిత్రం. బాక్సాఫీస్ వద్ద ఏకంగా 300 కోట్ల వసూళ్లు సాధించడంతో? సౌత్ లో బాగా ఫేమస్ అయింది. ఫీమేల్ సెంట్రిక్ సస్పెన్స్ థ్రిల్లర్ కావడంతో కల్యాణీ పేరు మారు మ్రోగింది. ఇప్పుడిదే క్రేజ్ తో అమ్మడు మళ్లీ కోలీవుడ్ లో బిజీ అవుతుంది. ఇప్పటికే - జెన్నీ - చిత్రంలో నటిస్తోంది. తాజాగా కార్తీ హీరోగా నటిస్తోన్న మార్షల్ లోనూ ఛాన్స్ అందుకుంది. సినిమా ఆన్ సెట్స్ లో ఉన్నా ఇంత కాలం హీరోయిన్ ఎంపిక పూర్తి చేయలేదు.

**ఇదొక డిఫరెంట్ జానర్:**

పలువురు భామల్ని పరిశీలించినా? వారందర్నీ పక్కన బెట్టి కల్యాణీని తీసుకున్నారు. ఆలస్యపు ఎంపిక కూడా మేకర్స్ కి కలిసొచ్చిందని చెప్పొచ్చు. మార్కెట్ పరంగా కలిసొస్తుంది. ఆసంగతి పక్కన బెడితే కార్తీ హీరోగా తెరకెక్కుతోన్న 29వ చిత్రమిది. తమిళ అనే డైరెక్టర్ తెరకెక్కిస్తున్నాడు. డ్రీమ్ వారియర్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుంది. ఇదొక డిఫరెంట్ జానర్ చిత్రం. కొన్ని వాస్తవ సంఘటనలు ఆధారంగా రూపొందిస్తున్నారు. సీ బ్యాక్ డ్రాప్ లో సాగే పీరియాడిక్ చిత్రమిది. ఇప్పటి వరకూ కార్తీ ఈ జానర్లో సినిమాలు చేయలేదు.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com